- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
6-07-2026

సంపుటి : 01 సంచిక :105 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr.NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE105 NAMASTEY MAHAAPRABHA



## గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో దిగజారిన భారత్

- 200 దేశాల్లో 125వ స్థానానికి భారత్
- ర్యాంకింగ్‌లో చలనశీలతతో పాటు జీవన నాణ్యత పరిగణన
- టాప్--10లో 9 యూరోపియన్ దేశాల హవా
- స్వీడన్‌కు అగ్రస్థానం.. అత్యధిక స్కోరు సాధన

న్యూఢిల్లీ -05జూలై (మహాప్రభ ).
గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ (జీపీఐ) 2026లో భారత్ దిగజారింది. ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలలో భారత పాస్‌పోర్ట్ ర్యాంకు 125వ స్థానంలో నిలిచింది. దాదాపు పూర్తిగా వీసా రహిత ప్రవేశంపై దృష్టి సారించే సాంప్రదాయ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లకు భిన్నంగా, గ్లోబల్ సిటిజన్ సొల్యూషన్స్ రూపొందించిన గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్ మరింత సమగ్రమైన సమాచారం ఆధారంగా ర్యాంకులు కేటాయించింది. ఇందులో చలనశీలత, పెట్టుబడి, జీవన నాణ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ ఏడాదికి సంబంధించి గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో యూరప్ మరోసారి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ప్రపంచంలోని టాప్ 10 పాస్‌పోర్ట్‌లలో తొమ్మిది యూరోపియన్ దేశాలకు చెందినవి కావటం విశేషం. ఈ సంవత్సరం సూచికలో -మిగతా 3 లో

## మెట్రోపై ప్రత్యేక చొరవ చూపండి

### తెలంగాణకు ఫేజ్-1 అప్పగింతలో వేగం పెంచాలి

- ఫేజ్-2 నిర్మాణానికి తక్షణమే అమోదం తెలపాలి
- ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించండి
- ఆలస్యమయ్యేకొద్దీ ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదం
- కేంద్ర మంత్రులకు సీఎం రేవంత్‌రెడ్డి వేర్వేరు లేఖలు

కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, మనోహర్ లాల్ ఖట్టర్‌లకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 గురించి వివరించారు. మెట్రో ఫేజ్-2కు కేంద్ర ఆమోదం వేగవంతం చేయాలని అభ్యర్థించారు. మెట్రో ఫేజ్-1 స్వాధీనం ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌బీఐ క్యాపిటల్స్‌కు వెంటనే బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.



హైదరాబాద్-05జూలై (మహాప్రభ ).
హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణకు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-1ను తెలంగాణకు బదిలీ చేసే విషయంలో వేగం పెంచాలనీ, ఫేజ్-2 నిర్మాణానికి తక్షణమే ఆమోదం తెలపాలని ఆయన విన్నవించారు. ఎస్‌బీఐ క్యాప్స్‌ను తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేసే కొద్దీ మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు మనోహర్‌లాల్ ఖట్టర్, జి.కిషన్‌రెడ్డిలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం వేర్వేరుగా లేఖలు రాశారు. గత నెల 23, 24 తేదీల్లో కిషన్‌రెడ్డి -మిగతా 3 లో




## తెలంగాణలో భారీ వర్షాలు

- గత కొన్ని రోజులుగా తేలికపాటి, మోస్తారు వర్షాలు
- రాబోయే రోజుల్లో మరింత ఉధృతం
- బంగాళాఖాతంలో బలమైన అల్పపీడన ప్రభావం
- రాష్ట్రవ్యాప్తంగా రాగల 3, 4 రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక

హైదరాబాద్-05జూలై (మహాప్రభ ).
తెలంగాణ వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న తేలికపాటి, మోస్తారు వర్షాలు.. రాబోయే రోజుల్లో మరింత ఉధృతం కానున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన బలమైన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాగల మూడు, నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు దంచికొట్టనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఉత్తర ఒడిశా -- పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో శనివారం ఉదయం ఏర్పడిన బలమైన అల్పపీడనం అదే ప్రాంతంలో స్థిరంగా కొనసాగుతోంది. దీనికి తోడు 9.4 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిన ఉపరితల ఆవర్తనం నైరుతి దిశగా వంగి ఉంది. ఈ తీవ్ర ప్రభావంతో రాగల మూడు రోజుల్లో ఈ అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనించనుంది. దీని ఫలితంగా తెలంగాణపై వాన ముప్పు గట్టిగా పొంచి ఉంది.

-మిగతా 3 లో



## ఇరాన్‌కు మరోసారి ట్రంప్ హెచ్చరికలు

- మేం తలుచుకుంటే ఒక్క దెబ్బతో ఇరాన్ నేతలందరినీ చంపేవాళ్లం :
- 'చర్చలకు అవకాశం ఉండాలనే వదిలేశాం'
- ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ వ్యాఖ్యలు
- 'ప్రజలు మొసలి కన్నీరు కార్చి ఉండొచ్చు'

3 లో

## నిరుద్యోగ యువతకు శుభవార్త

- త్వరలో భారీ స్థాయిలో పోలీస్ ఉద్యోగాల భర్తీ
- మొత్తం 7,437 పోస్టులకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధం
- నోటిఫికేషన్ విడుదల చేసేందుకు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాట్లు

హైదరాబాద్ -05జూలై (మహాప్రభ ).
తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు శుభవార్త తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు త్వరలో భారీ స్థాయిలో పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 7,437 పోస్టులకు సంబంధించిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను సిద్ధం చేసినట్లు బోర్డు చైర్మన్ వెల్లడించారు. ఈ నియామకాల్లో 3,697 సివిల్ కానిస్టేబుల్ పోస్టులు, 1,052 -మిగతా 3 లో




## స్వాతంత్రం మా హక్కు

### పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఆందోళనలు..

- 27వ రోజుకు చేరిన పీవోకే ప్రజల ఉద్యమం
- జేఏఏసీ నేత సహా 600 మందిపై అరెస్టులు
- విడుదల కోరుతూ మరింత ఉధృతమైన నిరసనలు
- 'స్వాతంత్రం కావాలి.. లేదంటే భారత్‌లో విలీనం' నినాదాలు
- అణచివేత ఆరోపణల మధ్య కొనసాగుతున్న ఆందోళనలు



న్యూఢిల్లీ -05జూలై (మహాప్రభ ).
స్వాతంత్రం తమ హక్కు అని, పాకిస్తాన్ ప్రభుత్వం నుంచి స్వాతంత్రం కోరుకుంటున్నామని పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని పౌరులు నినదిస్తున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొంతకాలంగా పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీవోకే)లో ప్రజలు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆందోళనలు 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ క్రమంలో నిరసనకారులు తమ ఆందోళనలను మరింత ఉధృతం చేశారు. పీవోకేలో ఆందోళనలు చేస్తున్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) నాయకుడు షౌకత్ నవాజ్ మీర్‌తోపాటు మరో 600 మంది ఉద్యమకారులను, పౌరహక్కుల -మిగతా 3 లో

## హెర్మూజ్'లో ఇరాన్ సర్వీస్ ఫీజు..

- అండగా నిలిచిన దేశాలకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటన
- ఒమన్‌తో కలిసి సముద్ర రవాణా ఏర్పాట్లు
- 'ఇది టోల్ కాదు.. సేవలకు మాత్రమే రుసుము'
- అమెరికా షరతుల మధ్య ఇరాన్ తాజా ప్రకటనతో చర్చ

3 లో



## కేటీఆర్‌వి నాటకాలు

### కన్నెపల్లి పంపు దగ్గరకు వెళ్లి డ్రామాలు



- తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టింది
- పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారు
- తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దాము
- బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమే
- బీఆర్ఎస్‌పై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్ -05జూలై (మహాప్రభ ).
.: పదేళ్లలో తెలంగాణ ప్రజల జీవితాలను బీఆర్ఎస్ తాకట్టు పెట్టిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో నీటి పారుదల శాఖను నాశనం చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు ఏది ముట్టుకుంటే అది నాశనమని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వ్యాఖ్యానించారు. ఆదివారం కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. అధిక శాతం లోన్లు తీసుకొచ్చి బీఆర్ఎస్ నాయకుల లాభం కోసం కాళేశ్వరం కట్టారు తప్ప.. తెలంగాణ ప్రజల కోసం కాదని చెప్పుకొచ్చారు. రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి నామమాత్రపు ఆయకట్టు ఇచ్చారని -మిగతా 3 లో



## భారీ వర్షాలతో ముంబయి అస్తవ్యస్తం..

- దేశ వాణిజ్య రాజధాని అతలాకుతలం
- కుర్లాలో చెట్టు కూలి వృద్ధుడి మృతి
- లోతట్టు ప్రాంతాలు జలమయం.. మెట్రో సహా రవాణాకు అంతరాయం
- పలు విమానాలు రద్దు, మరికొన్ని దారి మళ్లింపు
- రెడ్ అలర్ట్ జారీ.. రన్‌వే కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేత

ముంబయి-05జూలై (మహాప్రభ ).
: దేశ వాణిజ్య రాజధాని ముంబయిని భారీ వర్షాలు, ఈదురుగాలులు అతలాకుతలం చేస్తున్నాయి. దీంతో ఆది వారం ఇండిగోకు చెందిన నాలుగు విమానాలు రద్దు కాగా వివిధ సంస్థలకు చెందిన 13 ల్యాండింగ్ విమానాలను సమీపంలోని విమా నాశ్రయాలకు దారి మళ్లించామని అధికారిక వర్గాలు చెప్పాయి. అవి సురక్షితంగా ముంబయిలోనే ల్యాండ్ అయ్యాయని వివరించాయి. భారీ వర్షాలతో ముంబయిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనితో వాహనాల రాకపోకలు స్తంభించా యి. మెట్రో మార్గాల్లోనూ అంతరాయం

-మిగతా 3 లో



## రైతన్నా భయపడొద్దు.. వచ్చేది మన సర్కారే

- కేసీఆర్ రైతులకు ఎంతో చేసిండ్రు
- కాంగ్రెస్ రైతును ముంచుతున్నది
- కాళేశ్వరంతో ఎస్సారెస్పీకి నీరు
- ఆయిల్‌పామ్‌తో ఆర్థికాభివృద్ధి
- రేపాకలో రైతులతో కేటీఆర్

రేగొండ, -05జూలై (మహాప్రభ ).
రైతులు నిరుత్సాహపడొద్దని, రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభయమిచ్చారు. రైతుల బాగు కోసం కేసీఆర్ ముందుచూపుతో ఆలోచిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను ఆర్థికంగా ఎలా దెబ్బతీయాలో కుట్ర చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టును మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంతానికి ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం కేటీఆర్ కన్నెపల్లి పర్యటనకు

-మిగతా 3 లో


## బంగాళాఖాతంలో వాయుగుండంగా మారిన అల్పపీడనం..

- భారీ వర్షసూచన



**న్యూఢీల్లి -05జూలై (మహాప్రభ ).**
వాయవ్య బంగాళాఖాతం లో ఏర్పడిన అల్పపీడనం మరింత బలపడి వాయుగుండం గా మారింది. ప్రస్తుతం ఇది బాలాసోర్‌కు దక్షిణ-ఆగ్నేయంగా 50 కిలోమీటర్లు, చాంద్‌బలికి ఈశాన్యంగా 60 కిలోమీటర్లు, దిఘాకు దక్షిణ-నైరుతిగా 60 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. ఈ వాయుగుండం రాబోయే 24 గంటల్లో పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ బాలాసోర్ సమీపంలో చాంద్‌బలి-దిఘా మధ్య ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉంది.అనంతరం మరో 24 గంటల్లో ఉత్తర ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల వైపు పయనించనుంది. ఈ వాయుగుండం ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు-మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే ఒకటి లేదా రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. సముద్ర తీరం వెంబడి గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దాంతో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్న వారు వెంటనే సురక్షితంగా తీరానికి చేరుకోవాలని సూచించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని విపత్తు నిర్వహణ శాఖ సూచన చేసింది.


## కేతన్ అగర్వాల్ ఇంట్లో విషాదం..




**న్యూఢీల్లి -05జూలై (మహాప్రభ ).**
పుణెలో యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అతడి ఇంట్లో మరో విషాదం నెలకొంది. కేతన్ తాత దేవీచంద్ అగర్వాల్ (71) మృతి చెందారు. మనవడు మరణించినప్పటి నుంచి ఆయన ఆరోగ్య పరిస్థితి దిగజారినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. మరోవైపు కేతన్ హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

## పిల్లలపై అభ్యంతరకర యాడ్స్ తొలగించండి..

- మెటాకు కేంద్రం నోటీసులు




**న్యూఢీల్లి -05జూలై (మహాప్రభ ).**
పిల్లలపై అభ్యంతరకర యాడ్స్ ప్రసారం చేస్తున్న ఇన్‌స్టాగ్రామ్‌పై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కంటెంట్ వెంటనే తొలగించాలంటూ ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్య సంస్థ మెటాకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు.. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలతో వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అడ్ ఐటీ శాఖ ఆదివారం నోటీసులు జారీ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దాడిని ప్రోత్సహించేలా అభ్యంతరకర పెయిడ్ యాడ్స్ వస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. ఈ తరహా యాడ్స్‌ను, కంటెంట్‌ను తొలగించాలంటూ ఆదేశాలిచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లల గురించి ప్రసారమవుతున్న అభ్యంతరకర యాడ్స్‌పై ఇటీవల బీబీసీ ఒక కథనం ప్రచురించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై స్పందించిన కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ.. మెటాకు నోటీసులు జారీ చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అడ్ ఐటీ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఈ శాఖ ఆదివారం మెటాకు నోటీసులు ఇచ్చింది. ఈ యాడ్స్‌ను కట్టడి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని సూచించింది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఎలాంటి విధానాలు పాటిస్తారో చెప్పాలని ఆదేశించింది. ఇలాంటి అసభ్యకర కంటెంట్‌ను ఎలా అనుమతించారని ప్రశ్నించింది. అలాగే, మెటా ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకుంటే సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా అసభ్యకర కంటెంట్ ప్రసారమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యాప్‌లను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని, చట్ట వ్యతిరేక, పిల్లలపై లైంగిక చర్యలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రమోట్ చేస్తున్నారనే విమర్శ ఎప్పటినుంచో ఉంది. బీబీసీ కథనాలతో ఈ అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌పై వచ్చే పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర యాడ్స్‌పై క్లిక్ చేస్తూ అది టెలిగ్రామ్‌లోకి ఓపెన్ అవుతుంది. అక్కడికి వెళ్తే రూ.99కే అభ్యంతరకర కంటెంట్ అంటూ వీడియోలు ఉంటున్నాయి. ఇది థర్డ్ పార్టీకి సంబంధించిన యాప్ అయినప్పటికీ.. దీని ద్వారా మెటాకు ఆదాయం వస్తుంది కాబట్టి.. మెటానే దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని కేంద్రం తెలిపింది.

# హర్యానాలో ఎన్‌కౌంటర్..

**ఇద్దరు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు హతం..!**

**న్యూఢీల్లి -05జూలై (మహాప్రభ ).**
హర్యానాలో ఈ ఉదయం జరిగిన ఓ భారీ ఎన్‌కౌంటర్ లో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఇద్దరు కీలక సభ్యులు హతమయ్యారు. మరణించిన ఆ ఇద్దరిపై హర్యానా పోలీసులు తలా లక్ష రూపాయల రివార్డు ప్రకటించారు. బహదూర్‌గఢ్ లో ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ కౌంటర్ ఇంటెలిజెన్స్ యూనిట్, హర్యానా 'స్పెషల్ టాస్క్ ఫోర్స్ ' సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఆపరేషన్‌లో ఢిల్లీ పోలీసు కానిస్టేబుల్ ఒకరికి గాయాలయ్యాయి.ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ అధికారి ప్రమోద్ కుష్వా ఈ ఆపరేషన్ వివరాలు వెల్లడించారు. నిందితులను హిసార్‌కు చెందిన ప్రవేశ్, జఖోద్ ఖేరా గ్రామానికి చెందిన హిమాన్షుగా గుర్తించినట్టు తెలిపారు. వీరు లారెన్స్ బిష్ణోయ్-



హరిరామ్ అలియాస్ హ్యారీ బాక్సర్-అనిల్ పండిట్ క్రైమ్ నెట్‌వర్క్‌తో సంబంధాలు కలిగి ఉన్నారని, పలు కేసుల్లో పరారీలో ఉన్నారని చెప్పారు. జూన్ 11న హన్సీలో కపిల్ అనే జిమ్ ఆపరేటర్‌ను పట్టపగలే దారుణంగా హత్య చేసిన కేసులో వీరు ప్రధాన నిందితులుగా ఉన్నారు. ఈ హత్యకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ కూడా అప్పట్లో సంచలనం సృష్టించింది. మరో తీవ్రమైన నేరానికి పాల్పడేందుకు నిందితులు ఆయుధాలతో బహదూర్‌గఢ్ ప్రాంతానికి వచ్చినట్లు పోలీసులకు కచ్చితమైన సమాచారం అందింది. దీంతో ఢిల్లీ స్పెషల్ సెల్, హర్యానా ఎస్టీఎఫ్ బృందాలు సంయుక్తంగా వారిని ట్రాక్ చేసి చుట్టుముట్టాయి. లొంగిపోవాలని కోరగా నిందితులు పోలీసులపై కాల్పులు జరిపారని హర్యానా ఎస్టీఎఫ్ ఎస్పీ విక్రాంత్ భూషణ్ తెలిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపాల్సి వచ్చిందన్నారు. ఈ కాల్పుల్లో ఇద్దరు నిందితులతోపాటు ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్‌కు చెందిన కానిస్టేబుల్ అంకిత్ కాలికి బుల్లెట్ గాయమైంది. గాయపడిన ముగ్గురినీ వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ నిందితులిద్దరూ మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. కానిస్టేబుల్ అంకిత్ చికిత్స పొందుతున్నారని, అతనికి ప్రాణాపాయం లేదని అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై బహదూర్‌గఢ్ సదర్ పోలీస్ స్టేషన్‌లో కొత్త కేసు నమోదు చేసి, చట్టపరమైన విచారణ జరుపుతున్నట్లు వెల్లడించారు.

# ఆత్మహత్య ఆలోచనలు డాక్టర్లలోనే ఎక్కువ.

**ఫైమా సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి!**

**న్యూఢీల్లి -05జూలై (మహాప్రభ ).**
ప్రజారోగ్యానికి వెన్నెముకలా నిలిచే వైద్యులు పనిభారంతో సతమతం అవుతున్నారు. తీవ్రమైన ఒత్తిడి కారణంగా ఆత్మహత్య ఆలోచనలు చేస్తుండటం తీవ్ర ఆందోళన రేపుతున్నది. తాజాగా ది ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్(ఫైమా) దేశవ్యాప్తంగా 'రివ్యూ మెడికల్ సిస్టమ్(ఆర్ఎంఎస్) 2.0' పేరిట నిర్వహించిన సర్వే వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తెచ్చింది.దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, యూటీలు కలిపి 1,260 మంది రెసిడెంట్ డాక్టర్ల నుంచి సేకరించిన డాటా ఆధారంగా ఈ సర్వే రూపొందించినట్టు ఫైమా తెలిపింది. ఇందులో 87.5 శాతం మంది తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నట్టు తేలింది. 87.8 శాతం మంది నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నట్టు వెల్లడించింది. 61.8 శాతం మంది 36 గంటలు నిరంతరాయంగా పనిచేస్తున్నట్టు పేర్కొన్నది. 63.7



శాతం డ్యూటీ పూర్తయిన తర్వాత కనీసం విశ్రాంతి కూడా తీసుకోవడం లేదని వెల్లడించింది. ఈ కారణాలతో 54.4 శాతం మంది రెసిడెన్సీ(తమ పీజీ సీటు) వదిలి వెళ్లిపోవాలని ఆలోచిస్తున్నారని వివరించింది. 16.9 శాతం మంది ఆత్మహత్య ఆలోచనలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. 69.1 శాతం మంది తీవ్రమైన పని భారం ఉందని తెలిపారు. 46.7 శాతం మంది వారానికి 80 గంటలు పని చేస్తున్నామని, 20.3 శాతం మంది వారానికి 100 గంటలకు పైగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్యరంగంలో సిబ్బంది కొరత, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే వ్యవస్థ లేకపోవడం, సకాలంలో స్టైఫండ్ అందకపోవడం, బాండ్ పాలసీలు (కోర్సు మధ్యలో వదిలి వెళితే విధించే భారీ జరిమానాలు), పనిభారంతో అకడమిక్ కోర్సుపై ఎఫెక్ట్ పడుతున్నదని సర్వే ఆందోళన వ్యక్తం చేసింది.

**తీసుకురావాల్సిన సంస్కరణలు ఇలా..**
రెసిడెంట్ డాక్టర్ల సంరక్షణకు తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సర్వే సూచించింది. రెసిడెంట్ డాక్టర్ల పనివేళలపై జాతీయ స్థాయిలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేసింది. ఎక్కువ సేపు షిఫ్టుల్లో పనిచేసిన తర్వాత విశ్రాంతి తీసుకోవడం తప్పనిసరి చేయాలని, వైద్యుల కొరతను తీర్చేందుకు వెంటనే నియామకాలు చేపట్టాలని పేర్కొన్నది. ఏకధాటిగా 36 గంటల డ్యూటీలు వేయవద్దని కోరింది. ప్రతి మెడికల్ కాలేజీలో మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉంచడంతో పాటు దేశవ్యాప్తంగా ఒకే విధమైన స్టైఫండ్ విధానం అమలు చేయాలని, బాండ్ పాలసీ, జరిమానాల్లో సవరణలు చేయాలని, ఎప్పటికప్పుడు రెసిడెంట్ డాక్టర్ల సంక్షేమాన్ని మానిటరింగ్ చేసే వ్యవస్థను రూపొందించాలని సూచించింది. రోగుల భద్రత, నాణ్యమైన వైద్య విద్యను దృష్టిలో ఉంచుకొని రెసిడెంట్ డాక్టర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సర్వే అభిప్రాయపడింది.

# వెనిజులా భూకంపం..

**-3,000కు చేరిన మృతుల సంఖ్య..**
**-వారం రోజులపాటు సంతాపదినాలు**

**న్యూఢీల్లి -05జూలై (మహాప్రభ ).**
వెనిజులా భూకంపం ఆ దేశానికి తీరని విషాదాన్ని మిగిల్చింది. గత నెలలో సంభవించిన రెండు వరుస భూకంపాల వల్ల దాదాపు 3,000 మంది మరణించినట్లు అంచనా. ఇప్పటికే 2,954 మందికిపైగా మృతదేహాల్ని సహాయక బృందాలు వెలికితీశాయి. మరోవైపు సహాయక చర్యలు కూడా ముగింపు దశకు చేరుకున్నాయి. ముఖ్యంగా విదేశీ సహాయక బృందాలు వెనిజువెలాను వీడుతున్నాయి. గత జూన్ 24న వెనిజులాలో వరుసగా రెండు భూకంపాలు సంభవించాయి. దక్షిణ కరాకస్ ప్రాంతంలో 7.2 తీవ్రతతో ఒక భూకంపం, 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించాయి. దీంతో అనేక బిల్డింగులు సహా నిర్మాణాలు నేలకూలాయి.ఈ ఘటనలో ఇప్పటివరకు 2,954 మంది మరణించారు. దాదాపు 16,500 మంది గాయపడ్డారు. ఇంకా



బాధితుల వెలికితీత, శిథిలాల తొలగింపు వంటి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయినప్పటికీ చాలా చోట్ల సహాయక చర్యలు ఆగిపోయాయి. అలాగే వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థలకు చెందిన సహాయక బృందాలు తమ సహాయక చర్యల్ని ఆపేస్తున్నాయి. వెనిజులా వీడేందుకు సిద్ధమయ్యాయి. భూకంపం సంభవించిన తర్వాత మొదటి 72 గంటల రెస్క్యూ విండో పీరియడ్ చాలా కీలకం. ఈ సమయంలో చేపట్టే రెస్క్యూ ఆపరేషన్ వల్ల ఎక్కువ మంది ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంటుందని అంచనా. 72 గంటల్లో ఎక్కువ మందిని బతికించడానికి రెస్క్యూ బృందాలు ప్రయత్నిస్తాయి. అయితే, భూకంపం సంభవించి దాదాపు 9 రోజులు కావడంతో సహాయక చర్యల్ని నెమ్మదిగా కొనసాగిస్తున్నారు. ఎందుకంటే ఈ సమయంలో బాధితులు బతికి ఉండే అవకాశాలు చాలా తక్కువ. అందుకే కొన్ని సహాయక బృందాలు తమ ఆపరేషన్స్ నిలిపివేశాయి. అయితే, ఇంకా కొన్ని చోట్ల రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. ఇప్పటికీ శిథిలాల కింద నుంచి ఒకరిద్దరు ప్రాణాలతో బయటపడుతున్న ఘటనలున్నాయి. వేల మంది క్షతగాత్రుల్ని అధికారులు స్థానిక ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇంకా వేలమంది ఆచూకీ దొరకలేదని అధికారులు తెలిపారు. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం.. 50,000 మంది కనిపించకుండా పోయినట్లు తెలుస్తోంది. భారీ ప్రాణ నష్టం జరిగిన నేపథ్యంలో వెనిజులా ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. వారం రోజులపాటు భూకంప మృతులకు జాతీయ సంతాప దినాలుగా ప్రకటించింది. ఇక, భూకంపం సంభవించినప్పటి నుంచి ఇప్పటివరకు మళ్లీ 942సార్లు భూప్రకంపనలు వచ్చాయని అక్కడి అధికారులు తెలిపారు.

# గ్యాస్ వినియోగదారులకు ఉపశమనం..

- సహజవాయువు సరఫరాపై ఆంక్షలను ఎత్తివేసిన కేంద్రం

**న్యూఢీల్లి -05జూలై (మహాప్రభ ).**
సహజవాయువు సరఫరాపై విధించిన అత్యవసర ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. పశ్చిమాసియా నుంచి హర్మూజ్ జలసంధి ద్వారా ద్రవీకృత సహజవాయువు రవాణా తిరిగి సాధారణ స్థితికి చేరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. ఈ మేరకు 'నేచురల్ గ్యాస్ (సరఫరా నియంత్రణ) ఆర్డర్, 2026' ను సవరించినట్లు తెలిపింది.పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి మార్గంలో ఎల్ఎన్‌జీ నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాంతో సరఫరా సంస్థలు 'ఫోర్స్ మేజర్' ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 9న కేంద్రం అత్యవసర నిబంధనలను అమల్లోకి తెచ్చింది. దేశీయ గ్యాస్, దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీని గృహ అవసరాలు, రవాణా రంగం (సీఎన్‌జీ), ఎల్పీజీ ఉత్పత్తి, ఎరువుల కర్మాగారాల వంటి కీలక రంగాలకు మాత్రమే కేటాయించింది. పెట్రోకెమికల్స్, విద్యుత్ ప్లాంట్ల వంటి




ప్రాధాన్యత లేని రంగాలకు సరఫరాలో కోతలు విధించింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో కాల్పుల విరమణ అమలు, శాంతి చర్చలు జరుగుతుండటంతో పరిస్థితులు చక్కబడ్డాయని, సముద్ర మార్గంలో రవాణా సాధారణ స్థితికి చేరుకుందని మంత్రిత్వ శాఖ వివరించింది. అందుకే అత్యవసర చర్యలు ఇక అవసరం లేదని పేర్కొంది. సంక్షోభ సమయంలో విధించిన మూడు అత్యవసర నిబంధనల్లో ఇది చివరిది. ఇప్పటికే రిఫైనరీలు ఎల్పీజీ ఉత్పత్తిని పెంచాలన్న ఆదేశాలను, బల్క్ డీజిల్ అమ్మకాలపై ఆంక్షలను ప్రభుత్వం ఉపసంహరించుకుంది.తాజా నిర్ణయంతో పరిశ్రమలు, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు, ఇతర వినియోగదారులపై ఒత్తిడి తగ్గనుంది. ఇకపై గ్యాస్ కేటాయింపులు సాధారణ వాణిజ్య ఒప్పందాల ప్రకారం కొనసాగుతాయి.

నమస్తే మహాప్రభ
జనరల్ న్యూస్
MAHAA PRABHA NEWS
సోమవారం 6-07-2026
WWW.MAHAAPRABHA.COM తెలుగు దినపత్రిక


## గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో
# దిగజారిన భారత్

మొదటి తరువాయి

10 అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌లు.. స్వీడన్, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్, జర్మనీ, డెన్మార్క్ (ఉమ్మడి), నెదర్లాండ్స్ (ఉమ్మడి), ఐర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే), నార్వే, సింగపూర్ దేశాల నుంచి ఉన్నాయి. అత్యుత్తమ ప్రదర్శనతో స్వీడన్ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా నిలిచింది. చలనశీలతలో ప్రపంచవ్యాప్తంగా 11వ స్థానంలో ఉన్నప్పటికీ, పెట్టుబడిలో తొమ్మిదవ స్థానంలో, జీవన నాణ్యతలో రెండో స్థానంలో నిలిచి.. అత్యధిక మొత్తం స్కోరును సాధించింది.

# ఇరాన్‌కు మరోసారి ట్రంప్ హెచ్చరికలు

-మేం తలుచుకుంటే ఒక్క దెబ్బతో ఇరాన్ నేతలందరినీ చంపేవాళ్లం :
-'చర్చలకు అవకాశం ఉండాలనే వదిలేశాం'
-ఖమేనీ అంత్యక్రియలపై ట్రంప్ వ్యాఖ్యలు
-'ప్రజలు మొసలి కన్నీరు కార్చి ఉండొచ్చు'



**న్యూఢిల్లీ**
ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరికలు చేశారు. తాము అనుకుంటే ఖమేనీ అంత్యక్రియల ప్రారంభ కార్యక్రమంలోనే అక్కడున్న నాయకులందరినీ ఒక్కదెబ్బతో చంపేవాళ్లమని వ్యాఖ్యానించారు. కానీ తమతో చర్చలు జరపడానికి ఎవరూ ఉండరనే కారణంతో వారిని వదిలేశామని అన్నారుఆ దేశంలో మిగిలిన నాయకత్వాన్ని తాను నిర్మూలించగలనని, కానీ అలా చేయాలని తాను అనుకోవట్లేదని చెప్పారు. ఖమేనీ అంత్యక్రియల్లో వేలాది మంది ఇరానియన్లు కన్నీరు పెట్టుకోవడంపై ట్రంప్ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఆ దేశ ప్రజలు ఖమేనీని ద్వేషిస్తున్నారని ఇంతకాలం తాను అనుకున్నట్లు తెలిపారు. తాను అనుకున్నదే నిజమై ఉండొచ్చని.. అంత్యక్రియల సమయంలో ప్రజలు మొసలి కన్నీరు కార్చి ఉంటారని వ్యాఖ్యానించారు.

# నిరుద్యోగ యువతకు శుభవార్త

మొదటి తరువాయి




ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ పోస్టులు, 1,380 స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయనున్నారు. అలాగే 148 సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అంతేకూండా జైల్ వార్డెన్, ఫైర్ డిపార్ట్‌మెంట్ వార్డెన్ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను కూడా ఇదే ప్రక్రియలో విడుదలయ్యే అవకాశం ఉందని బోర్డు చైర్మన్ తెలిపారు. దీంతో పోలీస్, జైల్, ఫైర్ సర్వీసుల్లో ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న అభ్యర్థులకు ఇది మంచి అవకాశంగా మారనుంది. ప్రస్తుతం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ సిద్ధంగా ఉండగా, ప్రభుత్వ అనుమతులు పూర్తయిన వెంటనే అధికారిక నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అర్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం, పరీక్ష తేదీలు, దరఖాస్తు ప్రక్రియ వంటి పూర్తి వివరాలను అధికారిక ప్రకటనలో వెల్లడించనున్నారు.

# హెర్ముజ్'లో ఇరాన్ సర్వీస్ ఫీజు..

-అండగా నిలిచిన దేశాలకు ప్రాధాన్యం ఇస్తామని ప్రకటన
-ఒమన్‌తో కలిసి సముద్ర రవాణా ఏర్పాట్లు
-'ఇది టోల్ కాదు.. సేవలకు మాత్రమే రుసుము'



-అమెరికా షరతుల మధ్య ఇరాన్ తాజా ప్రకటనతో చర్చ

**టెహ్రాన్**
హెర్ముజ్ జలసంధిలో నౌకలపై సేవా రుసుము వసూలు చేసేందుకు ఇరాన్ ప్లాన్ చేస్తోందని ఆ దేశ రాయబారి అబ్దుల్‌రెజా రెహమాన్ ఫాజ్లి కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా రాజధాని బీజింగ్‌లో శనివారం జరిగిన ప్రపంచ శాంతి సదస్సులో ఆయన మాట్లాడుతూ.. యుద్ధ సమయంలో ఇరాన్‌కు అండగా నిలిచిన దేశాలకు మాత్రం సేవా రుసుములో ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు చెప్పారు. ఒమన్‌తో కలిసి ఇరాన్ హెర్ముజ్‌లో నౌకల రవాణాపై ఏర్పాట్లు చేస్తోందన్నారు. 'హెర్ముజ్ మా దేశంలో అంతర్భాగం. కాబట్టి మేం కచ్చితంగా సేవా రుసుము వసూలు చేస్తాం.ఇది టోల్ కాదు. జలసంధి గుండా నౌకలు సులభంగా వెళ్లేందుకు చేస్తున్న ఏర్పాట్లకు, ట్రాఫిక్‌ను నియంత్రించినందుకు మేం తీసుకుంటున్న సర్వీస్ ట్యాక్స్' అని అబ్దుల్ వెల్లడించారు. హెర్ముజ్‌లో ఎలాంటి టోల్ వసూలు చేయొద్దని అమెరికా షరతు పెట్టినా సరే ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారాయి. 60 రోజుల పాటు ఎలాంటి టోల్ వసూలు చేయొద్దని ఇరాన్-యూఎస్ ఒప్పందంలో ఉంది. ఆ తర్వాత ఏమైనా ట్యాక్సులు ఉంటాయా అని ప్రపంచం ఆందోళన చెందుతున్న వేళ.. అబ్దుల్ వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# మెట్రోపై ప్రత్యేక చొరవ చూపండి

మొదటి తరువాయి

సమక్ష?ంలో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మనోహర్‌లాల్ ఖట్టర్‌తో జరిగిన సమావేశాల్లో హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 బదిలీ, ఫేజ్-2 విస్తరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ, వాటిల్లో ఏ ఒక్కటీ అమల్లోకి రాలేదని సీఎం ఎత్తిచూపారు. ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐ క్యాప్స్)కు హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ, ఆర్థిక పరిస్థితుల సమీక్ష, తెలంగాణ ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు అవసరమైన ఆర్థిక పరిశీలన బాధ్యతలు అప్పగించేందుకు అంగీరించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతమున్న అధిక వడ్డీ రుణాలను తక్కువ వడ్డీ రుణాలుగా మార్చే రీఫైనాన్సింగ్ అవకాశాలను కూడా ఎస్‌బీఐ క్యాప్స్ పరిశీలించాలంటూ నిర్ణయించిన విషయాన్ని ప్రస్తావించారు. మెట్రో ఫేజ్-2 నిర్మాణానికి భారీ స్థాయిలో పెట్టుబడులు అవసరమవుతాయని వివరించారు. అందుకే అదే సంస్థ ద్వారా అవసరమైన ఆర్థిక నమూనా, దీర్ఘకాలిక రుణాలు, నిధుల సమీకరణ మార్గాలు, ప్రాజెక్టు అమలుకు కావాల్సిన ఆర్థిక వ్యూహాన్ని రూపొందించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిపారు. ఈ



ప్రక్రియ కోసం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీఓఆర్)ను వెంటనే ఖరారు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే మున్సిపల్ పరిపాలనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నోడల్ అధికారిగా నియమించినట్టు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరకు కేంద్రం ఎస్‌బీఐ క్యాప్స్‌ను అధికారికంగా నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌ను కూడా ఇంకా రాష్ట్ర ప్రభుత్వానికి పంపలేదని గుర్తుచేశారు. దీంతో మెట్రో ఫేజ్-1 బదిలీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయిందనీ, రోజువారీ నిర్వహణలో కూడా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్‌బీఐ క్యాప్స్ జాప్యం వల్ల మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రాజెక్టు నివేదికలకు కేంద్ర అనుమతులు కూడా ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల నిధుల సమీకరణ ముందుకు సాగట్లేదనీ, ప్రాజెక్టు ప్రారంభం మరింత ఆలస్యమవుతున్నదని తెలిపారు. ఇలా ఆలస్యమయ్యే కొద్దీ ధరల పెరుగుదల, వడ్డీ భారం, నిర్మాణ సామగ్రి వ్యయం పెరగడం వంటి కారణాలతో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటనీ, పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీ, విస్తరిస్తున్న నగర పరిధి, భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే మెట్రో విస్తరణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఫేజ్-1 బదిలీ పూర్తయి, ఫేజ్-2 వేగంగా అమలైతే నగర ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా నగరాభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని సీఎం కోరారు.

# తెలంగాణలో భారీ వర్షాలు

మొదటి తరువాయి

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో వాతావరణ శాఖ అత్యంత కీలకమైన హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.
ఈ మేరకు ఆ నాలుగు జిల్లాలకు అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. కేవలం వర్షాలే కాకుండా.. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పిడుగులు పడే ముప్పు ఎక్కువగా ఉన్నందున ప్రజలు, ముఖ్యంగా రైతులు, గొర్రెల కాపరులు పొలాల్లో ఉన్నప్పుడు చెట్ల కింద అస్సలు ఆశ్రయం పొందవద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సైతం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరోవైపు, ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాలపై కూడా ఈ అల్పపీడన ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ జిల్లాల పరిధిలోని వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశం ఉండటంతో రవాణా వ్యవస్థకు అంతరాయం కలగవచ్చని హెచ్చరించింది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది.
కాగా, శనివారం నాడు కూడా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురిశాయి. అత్యధికంగా కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం ఎల్లపల్లిలో 4.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఇదే జిల్లాలోని సిర్పూర్(టి)లో 3.8 సెం.మీ., వాంకిడిలో 3.8 సెం.మీ., ఆదిలాబాద్ జిల్లా బేల మండలం చాప్రాలో 3.5 సెం.మీ., అలాగే కామారెడ్డి జిల్లా కేంద్రంలో 3.4 సెం.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ భారీ వర్షాల కారణంగా సాగునీటి ప్రాజెక్టులకు వరద నీరు వచ్చి చేరే అవకాశం ఉంది. గోదావరి, కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లోని ఉపనదులు ఉధృతంగా ప్రవహించే ఆస్కారం ఉండటంతో నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. భారీ వర్షాల వల్ల విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, చెట్లు విరిగిపడటం వంటి సంఘటనలు జరిగే అవకాశం ఉన్నందున.. విద్యుత్ శాఖ సిబ్బందిని ఎమర్జెన్సీ సేవల కోసం సిద్ధంగా ఉంచారు. నగరాలు, పట్టణాల్లోని మునిసిపల్ అధికారులు డ్రైనేజీ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణాలు చేసే వారు వాతావరణ సూచనలను గమనించి, అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ప్రభుత్వం ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# స్వాతంత్ర్యం మా హక్కు

మొదటి తరువాయి

నేతలను ప్రభుత్వం అరెస్టు చేసింది.దీంతో వీరందరినీ విడుదల చేయాలని కోరుతూ జేఏఏసీ ఆధ్వర్యంలో మరింత భారీగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అనేక ప్రాంతాల్లో వేలాదిగా ఆందోళనకారులు నిరసన చేశారు. పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అక్రమంగా అరెస్టు చేసిన తమవారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో పాకిస్తాన్ పాలన నుంచి తమకు విముక్తి కావాలంటూ నిరన చేపట్టారు. లేకుంటే ఇండియాతో తమను మళ్లీ కలపాలని కోరుతున్నారు. ఇండియా నుంచి మానవతా సాయం, ఆహార సరఫరా కూడా అందుతుందని ఆందోళనకారులు అంటున్నారు. ఈ ఆందోళనల్లో పిల్లలు, యువత, మహిళలు సహా అందరూ పాల్గొంటున్నారు. ఇస్లామాబాద్ ప్రభుత్వం తమను ఇన్నాళ్లుగా దోపిడీకి గురి చేసిందని విమర్శించారు. స్వతంత్రం తమ హక్కు అని, తమకు స్వతంత్రం ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నించారు. తాము కోల్పోయిన స్వాతంత్ర్యాన్ని వెనక్కి తీసుకుంటామన్నారు.మరోవైపు ఆందోళనలపై పాక్ ప్రభుత్వం అణచివేసే చర్యలు చేపట్టే అవకాశం ఉన్నందున ఉద్యమకారులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. భద్రతా దళాల నుంచి ఎటువంటి ప్రతిఘటనా లేకుండా.. మహిళలు, పిల్లలు, వృద్ధులు ఆందోళనల్లో ముందు వరుసలో ఉంటున్నారు. ఇంకోవైపు ఆందోళనల్ని అణచివేసేందుకు పాక్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే పాక్ పోలీసులు, భద్రతా దళాలు జరిపిన దాడుల్లో 58 మంది పౌరులు మరణించినట్లు అంచనా. అయితే, అంతకంటే ఎక్కువ మందే మృతులు ఉంటారని స్థానికులు అంటున్నారు. దాదాపు నెల రోజులుగా పీవోకేలో ఆందోళనలు ఉధృతంగా కొనసాగుతున్నాయి.

# భారీ వర్షాలతో ముంబయి అస్తవ్యస్తం..

మొదటి తరువాయి

ఏర్పడింది. ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. సముద్రపు అలలు 4.19 మీటర్ల ఎత్తున ఎగసిపడే అవకాశం ఉందని హెచ్చరించింది. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజల కోసం 1916 హెల్ప్లైన్ నంబర్‌ను బీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే జలదిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు.భారీ వర్షాలు, ఈదురు గాలులతో ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరాల్సిన 90 శాతం విమానాలు గంటకు పైగా ఆలస్యంగా నడుస్తున్నాయి. రావాల్సిన విమానాల్లో 45 శాతం ఆలస్యంగా నడుస్తున్నాయి. దీనితో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదానీ గ్రూప్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) సంయుక్తంగా ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సదరు విమానాశ్రయ అధికారులు ఇవాళ ఒక ప్రకటన విడుదల చేశారు. "ఉదయం సుమారు 10.17 గంటల సమయంలో గంటకు 42 నాట్స్ వేగంతో వీచిన బలమైన గాలులు, భారీ వర్షం కారణంగా విజిబిలిటీ తగ్గింది. ఈ ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల రన్వే కార్యకలాపాలు ప్రభావం చూపాయి. నియమ, నిబంధనల ప్రకారం, ప్రయాణికులు, విమానాలు, గ్రౌండ్ సిబ్బంది భద్రతను దృష్టిలో ఉంచుకొని రన్వే కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశాం" అని వివరించారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత, ఒక గంట వ్యవధిలోనే రన్‌వేపై సాధారణ కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమైనట్టు వారు తెలిపారు.

# రైతన్నా భయపడొద్దు.. వచ్చేది మన సర్కారే

మొదటి తరువాయి

వెళ్లివస్తున్న క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకలో రైతు పైడిపల్లి బొందయ్య సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డితో కలిసి పరిశీలించి, రైతులతో మాట్లాడారు.ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, కేసీఆర్ ముందుచూపుతో ఆలోచించి, సబ్సిడీ ఇచ్చి సాగుకు ప్రోత్సహించిన విషయాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ పిలుపుతో రైతులు ముందుకొచ్చి ఆయిల్‌పామ్ తోటలను సాగు చేశారని, ఇప్పుడు అవి పంటదశకు చేరుకున్నాయని తెలిపారు. ఒకప్పుడు ఆంధ్రా ప్రాంతంలోనే ఈ పంటను సాగు చేసేవారని, తెలంగాణ రైతులు కూడా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఈ తోటల సాగుకు సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహించినట్టు పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతారని చెప్పారు. రానున్న రోజుల్లో కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, రైతులు ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు.

# కేటీఆర్‌వి నాటకాలు

మొదటి తరువాయి

మంత్రి ఉత్తమ్ తెలిపారు. ఆ ప్రాజెక్టులు అన్ని అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. తాము అధికారంలో వచ్చాక ఇరిగేషన్ శాఖను చక్కదిద్దామని వివరించారు. ఉల్టా చోర్ కొత్వాల్‌ను దండే అన్నట్లుగా బీఆర్ఎస్ నేతల తీరు ఉందని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది కేసీఆర్ హయాంలోనే.. కూలిపోయింది వాళ్ల హయాంలోనే అని ఇంజినీర్లు రిపోర్ట్ ఇచ్చారని ప్రస్తావించారు. కన్నెపల్లి పంపు దగ్గరకు పోయి ప్రాణహిత పంపు ఆన్ చేసి నీళ్లు ఇవ్వాలంటూ మాజీ మంత్రి



కేటీఆర్ నాటకాలు ఆడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సరిగ్గా కడితే ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ వల్లే కాళేశ్వరం నీళ్లు ఉపయోగించలేకపోతున్నామని అన్నారు. నాసిరక నిర్మాణం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగించలేకపోతున్నామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఫౌండేషన్ తప్పుగా ఉందని అధికారులు రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. కాళేశ్వరం ఇలానే కొనసాగిస్తే ప్రమాదమని అంతర్జాతీయ, జాతీయ నీటి నిపుణులు నివేదిక ఇచ్చారని అన్నారు. కేటీఆర్ కన్నా ఎన్‌ఎస్‌ఏఐ అధికారులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉందని తాను అనుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లు స్టోరేజ్ చేసినప్పుడు కూలిపోతే కింద ఉన్న 40 ఊర్లు, భద్రాచలం కొట్టుకుపోతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడి తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టకుండా తెలంగాణ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. లేకపోతే ఎప్పుడో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అయ్యేదని వివరించారు. తెలంగాణ ప్రజలకు అన్యాయం చేసింది గులాబీ పార్టీనే అని ఆగ్రహించారు. కాంగ్రెస్‌కి మంచి పేరు వస్తుందనే కారణంతో తుమ్మడిహెట్టి నుంచి మేడిగడ్డకి డిజైన్ మార్చారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దుయ్యబట్టారు.

## సంపాదకీయం

# 'భక్త'ద్రోహం!

హనుమంతుడికి ధ్యాన భంగం అయ్యింది. కలియుగం వచ్చినప్పటి నుండీ గంధమాదన పర్వతంపై తన రాముడిని ధ్యానిస్తూ ఉండిపోయాడు. హనుమంతుడు చిరంజీవిగా వర్ధిల్లాలని రాముడు వరమిచ్చాడు.



అందువల్ల అన్ని యుగాల్లోనూ హనుమంతుడు జీవిస్తూనే ఉంటాడు.
ధ్యానభంగం కావటంతో హనుమంతుడు గుహలో నుండి బయటకు వచ్చి అంతా పరికించి చూశాడు! ఎవరూ కనబడలేదు! మరింత శ్రద్ధగా చూశాడు. సుదూరంలోని చెట్టు కింద నుండి ఎవరో ఏడుస్తున్నారు! తన ధ్యానాన్ని భగ్నం చేసేంతగా రోదిస్తున్నదెవరో తెలుసుకోవటానికి ఆ చెట్టు కిందికి వెళ్లాడు.
చూడముచ్చటగా ఉన్న ఒక అందమైన బాలుడు చెట్టు కింద కూర్చుని వెక్కి, వెక్కి ఏడుస్తున్నాడు! అంత అందమైన బాలుడు ఏడుస్తుండటం చూసి, హనుమంతుడి గుండె తరుక్కుపోయింది!
"ఏమి జరిగినది బాలకా? ఎందుకలా ఏడ్చుచున్నావు?" అడిగాడు హనుమంతుడు.
"నా నగలు, డబ్బు దొంగలు ఎత్తుకెళ్లారు!" అంటూనే బాలుడు ఏడుస్తున్నాడు.
"ఇంత చిన్న వయస్సులో నీ వద్ద నగలు, డబ్బు ఉన్నాయా? అవి ఎంత మొత్తం? ఇంతకూ నీవెవరు?" అన్నాడు హనుమంతుడు.
"నేనెవరో నీకు ఇంకా తెలియదా?" ఆశ్చర్యంగా అడిగాడు బాలుడు.
'నీవెవరో తెలిసినచో అడగవల్సిన అవసరమేమున్నది?" బదులిచ్చాడు హనుమంతుడు.
"నా పేరు రామ్‌లల్లా !" అన్నాడు ఆ అందాల బాలుడు.
"రామ్‌లల్లా అనగా నేమి?" అమాయకంగా అడిగాడు హనుమంతుడు.
"రామ్‌లల్లా అనగా బాలరాముడు. మాది అయోధ్య!" అన్నాడు రామ్‌లల్లా. హనుమంతుడు పెద్దగా నవ్వాడు.
"ఎందుకు నవ్వుతున్నావు! మాది ఆయోధ్య, నేను బాలరాముడినీ!" అన్నాడు రామ్‌లల్లా.
"అయోధ్య రాముడు ఎలా ఉంటాడో చూపిస్తాను చూడు!" అంటూ తన గుండెను చీల్చబోయి ఆగిపోయాడు. తన రాముడిని మనసారా స్మరించాడు హనుమంతుడు .
"సీతా లక్ష్మణ సమేతుడై శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమ య్యాడు. అందరి శరీరాలపై వజ్ర వైడూర్యములతో బంగారు ఆభరణాలు మెరిసిపోతున్నాయి. ప్రత్యేకించి సీతమ్మ కంఠసీమలో చింతాకు పతకం కాంతులీనుతున్నది.
హనుమంతుడు పరమానంద భరితుడైపోయాడు.
రాములవారితో పాటు, సీతామాత, లక్ష్మణ స్వామి దర్శనం కూడా జరిగింది. ఆనందంతో గంతులు వేస్తున్నాడు.తన భక్తుడి ఆనందాన్ని చూసి రాముడు కూడా సంతృప్తి చెందాడు.
కాని రాముడిని, రాముడు ధరించిన నగలను చూసి రామ్‌లల్లా ఆశ్చర్యపోయుడు.
తన వద్ద నగలకన్నా మంచి, మంచి నగలు, ఆభరణాలు ఉన్నాయి!
"మీరెవరు, ఎక్కడి నుండి వచ్చారు!" అని అడిగాడు రామ్‌లల్లా.
"బాలరామా! నన్ను గుర్తించలేదా? నేను భద్రాద్రిరాముడను, నేనే శ్రీరామ చంద్రుడిని!" అన్నాడు రాముడు.
ఒకపక్క హనుమంతుడు, మరోపక్క రామ్‌లల్లా ఆశ్చర్య పోయారు.
"నా రాముడు అయోధ్యకు రాజు! ఇప్పుడేమిటి కొత్తగా భద్రాద్రి రాముడినని చెబుతున్నాడు!" అని హనుమంతుడు ఆశ్చర్యపోయాడు.
తనను గుర్తించలేదా! అని రాముడిగా పిలువబడుతున్న వ్యక్తి అడుగుతున్నాడు! తనకేమో ఆయన్ను ఎక్కడో చూసినట్లుంది కాని ఎవరో తెలియటం లేదు అని రామ్‌లల్లా ఆశ్చర్యపోయాడు.
శ్రీరామచంద్రుడు చిన్నగా నవ్వాడు.
"నేను శ్రీరాందుచంద్రుడిని, అయోధ్యకు రాజును. అయితే ఈ రామ్‌లల్లాను అయోధ్యలో గుడి నిర్మించి, అక్కడ నెలకొల్పారు. ఈ బాల రాముడు నేను ఒక్కరేనని ప్రచారం చేస్తున్నారు. ఈ రామ్‌లల్లాను ఆయోధ్యలో నెలకొల్పిన తర్వాత నేను భద్రాచలంలో నివసిస్తున్నాను" అన్నాడు రాముడు.
"నేను బాలరాముడిని, నీవు రాముడివి అయితే నీవు నేను ఒకటి కాదా? నీవు ఆయోధ్యను విడిచి, భద్రాచలం ఎందుకు వెళ్లావు! ఇప్పుడేమో నా కోసం ఇచ్చిన డబ్బులు, నగలు, ఆభరణాలు అంతా దొంగలు ఎత్తుకెళ్లారు! ఏమిటి ఇదంతా?" అడిగాడు రామ్‌లల్లా.
హుమమంతుడు కూడా ఆ ప్రశ్నలకు బదులివ్వమన్నట్లు చూశాడు.
"నీవు, నేను ఒక్కటి కానే కాదు! నా అవతారానికి ఒక లక్ష్యం ఉన్నది. నీవు నా యొక్క రూపానివి మాత్రమే! నిన్ను ప్రతిష్ఠించిన వారు, నిన్ను ఉపయోగించుకుంటున్నారు! వారికి నిజంగా నీ మీద భక్తి లేదు. నీ పేరు మీద అధికారాన్ని, డబ్బును పొందుతున్నారు. అందుకే వందల కోట్ల రూపాయలు, కిలోల కొద్దీ బంగారం దొంగలు ఎత్తుకుని పోయినా వారు నోరు మెదపటం లేదు! దొంగలను పట్టుకునే విధంగా చర్యలు తీసుకోవటం లేదు! అసలు దొంగతనం జరగకుండా ఉండటమే అసలైన భక్తి!" అన్నాడు రామచంద్రుడు.
"నీవు గందరగోళంగా మాట్లాడుతున్నావు! గుడి కట్టింది నా భక్తులే అంటావు, నన్ను ప్రతిష్టించిందీ వారేనంటావు! మరి దొంగలను పట్టుకోవటం లేదంటావు! దొంగలు చేసిన దానిని నా భక్తులను విమర్శి స్తున్నావు! ఇది దేశ ద్రోహం లాగా భక్త ద్రోహం అవుతుంది!" అన్నాడు రామ్‌లల్లా.
రాముడు మరోసారి నవ్వాడు.
"చూశావా! నీకూ నిన్ను ప్రతిష్ఠించిన వారి భాష వంటబట్టింది! దేశద్రోహం, భక్తద్రోహం అంటున్నావు. భక్తి ఉన్న చోట దొంగతనం జరగదు అన్నాను. తిరుపతిలో ప్రతిరోజూ కోట్లాది రూపాయలు, కిలోల కొద్దీ బంగారం వేంకటేశ్వరుడి హుండీలో భక్తులు వేస్తుంటారు! కాని దొంగతనం జరగటం లేదు, ఆసలైన భక్తికి మరో ఉదాహరణ చెప్పనా?" అడిగాడు రాముడు.
చెప్పమన్నట్లు చూశాడు రామ్‌లల్లా.
"భద్రాచలంలో తహసీల్దారుగా పనిచేస్తున్న గోపన్న ఆనాడు ప్రజలు నైజాం ప్రభుత్వానికి కట్టిన పన్నులతో నాకు, సీతకు నగలు, ఆభరణాలు చేయించాడు! అందుకే రామదాసు అయ్యాడు. రామదాసును హింసించినా, అది ప్రజల సొమ్ము దేవుడికి పెట్టాను తప్పేమిటి అని ఎదురు తిరిగాడు. అందుకే నేను, లక్ష్మణుడు రామదాసును చెర నుండి విడిపించాము! అది అసలైన భక్తి" అన్నాడు రాముడు.
పూర్తిగా అర్థం కాలేదన్నట్లు చూశాడు రామ్‌లల్లా.
భక్తి ఒకటే! గాని భక్తులు మాత్రం రెండు రకాలు, దేవుడి కోసం సర్వస్వం త్యాగం చేసి, భగవంతుడిలో కలసిపోవాలనుకునేవారు ఒక రకమైన వారు! దేవుడి పేరు మీద అన్నీ స్వాహా చేస్తూ, దేవుడినే తనలో కలిపేసి, తానే భగవదాంశ సంభూతుడినని, అలౌకిక శక్తినని చెప్పుకునే వారు రెండవ రకం! గత కొంత కాలంగా రెండవ రకం భక్తులు పెరిగిపోయారు, అందుకే అయోధ్యను విడిచి మొదటికోవకు చెందిన భక్తులున్న దక్షిణాపథానికి వచ్చి, భద్రాచలంలో కొలువుంటున్నాను!" అంటూ వివరించాడు రాముడు.
"అంటే నా డబ్బు, ఆభరణాలు తిరిగిరావా?" అడిగాడు రామ్‌లల్లా.
"ప్రస్తుతం నీ డబ్బు, ఆభరణాల కన్నా, నీ పేరు మీద జరుగుతున్న మోసాలను గుర్తించు. నీ పేరు మాటున నీ భక్తులైన ప్రజలను దోచుకుంటున్న తీరును తెలుసుకో!
నీ భక్తులమని చెబుతున్నవారే నీ ఆలయంలో దొంగతనానికి ఒడిగట్టారంటే, నీ కన్నా డబ్బు, నగల మీద వారికింత ఆపేక్ష ఉందో అర్థం చేసుకో. నిన్ను ఆసరాగా చేసుకుని అందలమెక్కినవారు, ఈ రోజు నీ గుళ్లో జరిగిన దొంగతనం గురించీ, ఒక్క మాట మాట్లా డటం లేదంటే, వారి భక్తిలోని మర్మమేమిటో తెలుసుకో, ఇవన్నీ అర్థమైననాడు, నీవు రామ్‌లల్లా నుండి భక్తి రాముడివి అవుతావు. అసలు నీవు కూడా అయోధ్యను తప్పక వీడతావు!" అంటూ సీతారామలక్ష్మణులు అంతర్థానమయ్యారు.

# పశ్చిమ బెంగాల్‌లో దారుణం..

**- 11 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్య..**
**సంచిలో మృతదేహం**


**న్యూఢిల్లీ -05జూలై (మహాప్రభ ).**
పశ్చిమ బెంగాల్‌లో దారుణ ఘటన జరిగింది. 11 ఏళ్ల బాలికపై అత్యాచారం జరిపి, హత్య చేశారు. బాలిక మృతదేహం ఒక సంచిలో లభ్యమైంది. ఈ ఘటన బెంగాల్, దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఆదివారం వేకువఝామున జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దక్షిణ 24 పరగణాల జిల్లాకు చెందిన 11 ఏళ్ల బాలిక శనివారం కనిపించకుండా పోయింది. ఒక స్నేహితురాలి బర్త్‌డే కోసం గిఫ్ట్ కొనేందుకు బాలిక బయటకు వెళ్లింది. అయితే, ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నలుగురు వ్యక్తులు తమ బాలికను ఎత్తుకెళ్లారని బాలిక కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వేకువఝామున బరుయ్‌పూర్ ప్రాంతంలోని, సుర్జ్యాపూర్ హాట్ ప్రాంతంలో ఒక సంచిలో బాలిక



మృతదేహం లభ్యమైంది. బాలికను అత్యాచారం చేసి, హతమార్చినట్లు గుర్తించారు. ఈ విషయం తెలియడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. నిందితులను వెంటనే పట్టుకుని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బరుయ్‌పూర్–జోయ్‌నగర్ రోడ్డును దిగ్బంధించారు. వందలాది మంది ఆందోళనకారులు రోడ్డుపై టైర్లు తగలబెడుతూ ఆందోళనకు దిగారు. పోలీసుల వాహనాలపై కూడా దాడి చేశారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కూడా పంపించకుండా అడ్డుకున్నారు. ఈ ఘటనపై ప్రెసిడెన్సీ రేంజ్ ఐజీ కంకార్ ప్రసాద్ స్పందించారు. నిరసనకారులు ఆందోళన విరమించాలని కోరారు. ఘటనతో సంబంధం ఉన్న నిందితులు అందరినీ అరెస్టు చేస్తామని, ఎవరినీ వదిలిపెట్టబోమని హామీ ఇచ్చారు. పోలీసులు హామీతో బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. బాలిక మృతికి గల కారణాలు అప్పుడే తెలుస్తాయన్నారు. ఇప్పటికే ఈ ఘటనతో సంబంధం ఉన్న ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మిగిలిన వారి కోసం కూడా గాలిస్తున్నామని ఐజీ తెలిపారు. బెంగాల్ సీఎం సువేందు అధికారి బాలిక తండ్రితో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. బాలిక కుటుంబానికి న్యాయం చేస్తామని, నిందితుల్ని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు బాలిక మృతిపై బరుయ్‌పూర్ ప్రాంతంలో ఆందోళనలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ నిరసనల్ని అదుపు చేయడానికి ప్రభుత్వం కేంద్ర బలగాల్ని మోహరించింది.

# పాకిస్థాన్ రక్షణ మంత్రికి మతి భ్రమించింది..

**-భారత్ స్ట్రాంగ్ కౌంటర్**





**న్యూఢిల్లీ -05జూలై (మహాప్రభ ).**
పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తలపొగరు వ్యాఖ్యలకు భారత్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. ఆయనకు మతి భ్రమించిందని, అందుకే ఏవేవో మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించింది. ఇటీవల ద్వీపదేశం సీషెల్స్‌లో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ అత్యున్నత 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్ పురస్కారం అందుకున్నారు.దీనిపై పాక్ మంత్రి ఖవాజా ఆసిఫ్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అది రూపొందించుకున్న గౌరవం (కావాలని ఇప్పించుకున్న అవార్డు) అని వ్యంగ్యంగా మాట్లాడారు. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఆయనకు పనేం లేదని, అవగాహనలేని అంశాలపై అర్థరహితమైన వ్యాఖ్యలు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నాడని వ్యాఖ్యానించింది. మతి భ్రమించి మాట్లాడుతున్నాడని విదేశాంగ శాఖకు చెందిన ఉన్నతాధికారులు కౌంటర్ ఇచ్చారు. ఇతరులపై అసూయ ఎప్పటికీ మంచి చేయదని, చెడును ప్రేరేపిస్తుందని అన్నారు. ముఖ్యంగా విద్వేషపూరిత ప్రసంగాలకు అలవాటు పడినవారిలో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని చెప్పారు. సీషెల్స్ అత్యున్నత పురస్కారం అందుకున్న తొలి వ్యక్తిగా ప్రధాని మోదీ నిలిచారు. మోదీ పర్యటనకు కొద్ది వారాల ముందే అంటే జూన్ 24న గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్ పురస్కారానికి అక్కడి మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

# కోడలిపై మామ అత్యాచారం..

**- రైల్వే ఉద్యోగి అయిన ఆ వ్యక్తి అరెస్ట్**




**లక్నో-05జూలై (మహాప్రభ ).**
రైల్వే ఉద్యోగి అయిన వ్యక్తి తన కోడలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. భర్త, కుటుంబ సభ్యులు కూడా అదనపు కట్నం కోసం తనను వేధించినట్లు ఆ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది. రైల్వేలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న 58 ఏళ్ల వ్యక్తి కుమారుడితో ఒక మహిళకు 2023 నవంబర్‌లో పెళ్లి జరిగింది.కాగా, వివాహం కోసం తన కుటుంబం సుమారు రూ. 55 లక్షలు ఖర్చు చేసినట్లు ఆ మహిళ తెలిపింది. పెళ్లైన మొదటి రాత్రే ఇద్దరు ఆడపడుచులు బలవంతంగా మద్యం తాగించి, సిగరెట్ స్మోక్ చేయించినట్లు ఆరోపించింది. తాను నిరాకరించగా గొంతు నులిమి చంపడానికి ప్రయత్నించారని, దీంతో తన ఆరోగ్యం క్షీణించినట్లు చెప్పింది. భర్త, ఆడపడుచులు తరచుగా స్నేహితులతో కలిసి ఇంట్లో పార్టీలు నిర్వహించేవారని, మామకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె పేర్కొంది. మరోవైపు పుట్టింటికి వెళ్ళిన తాను 2024 ఏప్రిల్‌లో అత్తవారింటికి చేరుకున్నట్లు ఆ మహిళ తెలిపింది. తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ బలవంతంగా మద్యం తాగించారని ఆమె చెప్పింది. తాను మత్తులో ఉన్న సమయంలో మామ తనపై అత్యాచారం చేసినట్లు ఆరోపించింది. పోలీసులకు సమాచారం అందించే వరకు భర్త, అత్తమామలు తనను మూడు రోజుల పాటు బందీగా ఉంచారని ఆమె తెలిపింది. అయితే, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి వెళ్లి ఆ మహిళను రక్షించారు. ఆమె ఫిర్యాదుతో మామపై తొలుత లైంగిక వేధింపులకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అత్యాచారానికి సంబంధించిన ఆధారాలు లభించడంతో ఆ సెక్షన్ కూడా చేర్చారు. పరారీలో ఉన్న ఆ రైల్వే ఉద్యోగిని శనివారం అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఒడిశా సీఎంను కించపర్చేలా ఏఐ వీడియో పోస్ట్..

**-ఒక యువకుడి అరెస్ట్**



**న్యూఢిల్లీ -05జూలై (మహాప్రభ ).**
ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝి ని కించపరిచేలా రూపొందించిన ఏఐ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు ఒక యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని కటక్‌కు చెందిన బిశ్వజిత గా గుర్తించారు. అతడిపై సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాలకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సైబర్ క్రైమ్ విభాగం రోజువారీ తనిఖీల్లో భాగంగా సోషల్ మీడియా ను పరిశీలించిన క్రమంలో అతడు సీఎంను కించపరిచేలా అసభ్యకర వీడియోలను సర్క్యులేట్ చేస్తున్నట్లు బహిర్గతమైంది.ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని నిందితుడు ఏఐతో రూపొందించిన ఫొటోలు, రీల్స్‌ను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నట్లు గుర్తించాం. సీఎంను కించపరిచేలా నిందితుడు కొన్ని అసభ్యకర వ్యాఖ్యలు చేశాడని, అవి వైరల్ కావడంతో అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. తప్పుడు సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి కష్టాలు కొని తెచ్చుకోవద్దని సోషల్ మీడియా యూజర్లను పోలీసులు హెచ్చరించారు.

# హిందువులను హిప్నటైజ్ చేసి దోచుకుంటున్నారు

**- అయోధ్య విరాళాల వివాదంపై ఉద్ధవ్ ఠాక్రే**


**ముంబై: -05జూలై (మహాప్రభ ).**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందువులను హిప్నటైజ్ చేసిందని, వారిని దోచుకుంటోందని మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు.



ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఉన్న రామ మందిరానికి అందిన విరాళాలలో జరిగిన అవకతవకలపై 'రామ రక్షా ఆందోళన్'ను ఆయన ప్రారంభించారు. ఆదివారం ముంబైలోని దాదర్‌లో వందలాది మంది శివసేన (యూబీటీ) కార్యకర్తలతో కలిసి రామ రక్షా స్తోత్రం, హనుమాన్ చాలీసా, మారుతీ స్తోత్రం పఠించారు.కాగా, బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'హిందువులను దోచుకుంటోందని' ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. 'నరేంద్ర మోదీ ప్రభుత్వం హిందువులను దోచుకుంటున్న ప్రభుత్వం. ఇది కేదార్‌నాథ్–బద్రీనాథ్‌తో మొదలైంది. ఇప్పుడు అయోధ్య వంతు. అయోధ్య ఒక ట్రైలర్ మాత్రమే. కాశీ, మధుర ఇంకా చాలా ఉన్నాయని వారు అంటారు. అక్కడ జరుగుతున్న దోపిడీ గురించి నాకు ఆందోళనగా ఉంది' అని అన్నారు. మరోవైపు హిందువులను దోచుకుంటున్న హిందువులు అధికారంలో ఉండటం దురదృష్టకరమని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు. 'మేము పరాక్రమవంతులం, అమాయకులం, దేశాన్ని ప్రేమించే హిందువులం, కానీ మూర్ఖులం కాదు' అని అన్నారు. 'ఈ రోజు హిందువులు మాయలో పడ్డారు. దేశంలోని హిందువులంతా మేల్కొని, శ్రీరాముడిని దోచుకుంటున్న వారికి వ్యతిరేకంగా పోరాడాలని నేను కోరుతున్నా' అని పిలుపునిచ్చారు. మహారాష్ట్రతో పాటు దేశ వ్యాప్తంగా 'రామ రక్షా ఆందోళన్' కార్యక్రమాలు చేపడతామని ఆయన అన్నారు.

# హర్మ్యూజ్‌లో కొత్త సేవా రుసుములు: ఇరాన్

**హైదరాబాద్ -05జూలై (మహాప్రభ ).**
హర్మ్యూజ్ జల సంధి గుండా వెళ్లే నౌకలపై కొత్త సేవా రుసుములను విధిస్తామని చైనాలో ఇరాన్ రాయబారి తెలిపారు. అయితే..



ఇటీవల ఘర్షణల సమయంలో ఇరాన్‌కు మద్దతు ఇచ్చిన దేశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. బీజింగ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యూహాత్మక జల మార్గం ద్వారా వెళ్లే నౌకల రవాణాను నిర్వహించడానికి కొత్త ఏర్పాట్లపై ఒమన్‌తో కలిసి ఇరాన్ పనిచేస్తుందని వెల్లడించారు. నౌకలపై రుసుముల ఆలోచనను అమెరికా తిరస్కరించినప్పటికీ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# మైనంపల్లి రోహిత్ రావుకు పాపన్నపేటలో కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం.

**-రూ.22.50 కోట్లతో మంజూరైన మంజీరా రోడ్డుపై హర్షం..**



**మెదక్ జిల్లా -05జూలై (మహాప్రభ ).**
మెదక్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు కృషి ఫలితంగా కామారెడ్డి జిల్లా,ధర్మారెడ్డి నుండి మెదక్ జిల్లా,పాపన్నపేట మండలం ముద్దాపూర్ వరకు,వెంకంపల్లి మీదుగా పాపన్నపేట వైపు- మంజీరా నదిపై ఎచ్ ఎల్ బి ంఅప్రోచ్ రోడ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 22.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈశు భవార్తతో ఉబ్బితబ్బిబ్బైన పాపన్నపేట మండల నాయకులు,కాంగ్రెస్ కార్యకర్తలు,గ్రామ ప్రజలు ఆదివారం రోజు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు చిత్ర పటానికి ఘనంగా పాలాభిషేకం నిర్వహించి, టపాసులు కాల్చి,స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగంపేట నరేందర్ గౌడ్ మాట్లాడుతూ వెంకంపల్లి,ముద్దాపూర్ గ్రామ ప్రజలు గత 20 సంవత్సరాలుగా మేము పడుతున్న బాధను అర్థం చేసుకుని మాకు రోడ్డు సౌకర్యం తెప్పించిన మా ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. మారవాణా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన డైనమిక్ లీడర్ మీరేన ని కృతజ్ఞతలు తెలిపారు.జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ డా.మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వంలోనే మెదక్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని,ఆయన ఒక ప్రజా నాయకుడుని కొనియాడారు.ఈకార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి శెట్టి శ్రీకాంత్ అప్పా,మాజీ జడ్పీటీసీ ఎల్.మల్లప్ప,కుర్తివాడ, లింగాయి పల్లి సర్పంచ్లు శ్రీధర్,సిద్ధప్ప,నాయకులు పంతులు భూమయ్యా, ఏడు పాయల దేవస్థానం మాజీ చైర్మన్ లు పార్శి నర్సింలు గుప్తా,కే.వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీటీసీ మౌనిక రాజు నాయక్,మాజీ కో- ఆప్షన్ సభ్యులు ఎండీ.గౌస్ పాషా,పాపన్నపేట మాజీ ఉపసర్పంచ్ ఎండీ.ఖలీం, నాయకులు దోసనీ సంగమేశ్వర్,ముశెట్టి కిష్టయ్య, సుంకరి శివయ్య,బెస్త శ్రీశైలం, పిరంగి నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ, నెహ్రూ ల మధ్య వ్యత్యాసం.. మాజీ ప్రధానిని కించపరిచడం సరికాదు

**మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ ఉద్దీన్..**



**మెదక్ జిల్లా -05జూలై (మహాప్రభ )**
దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సేవలను కించపరిచేలా చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హఫీజ్ ఉద్దీన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీని జవహర్‌లాల్ నెహ్రూతో పోల్చడం సరికాదని, ఇద్దరి పాలనా విధానం, పరిస్థితులు, చారిత్రక నేపథ్యం పూర్తిగా భిన్నమని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం దేశం ఆహార కొరత, నిరుద్యోగం, పారిశ్రామిక వెనుకబాటు, మౌలిక వసతుల లేమి వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ దేశాన్ని నడిపించారని పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఆయన బలమైన పునాదులు వేశారని తెలిపారు.నెహ్రూ దూరదృష్టితో అమలు చేసిన పంచవర్ష ప్రణాళికలు, భారీ సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ఉన్నత విద్యాసంస్థలు నేటి భారత అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలిచాయని హఫీజ్ ఉద్దీన్ అన్నారు. రాజకీయ విమర్శలు చేసే క్రమంలో దేశ తొలి ప్రధానిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని, అన్ని రాజకీయ పార్టీలు చరిత్రను, దేశ నాయకుల సేవలను గౌరవించాలని ఆయన సూచించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ.

**-రోజురోజుకు కొత్త తరహా మోసాలు.**
**-ఏపీకే ఫైల్స్, క్యూఆర్ కోడ్‌లతో ఉచ్చు**
**-1930కు వెంటనే ఫిర్యాదు చేయాలి.**
**-మెదక్ జిల్లా ఎస్పీ, డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్..**



**మెదక్ జిల్లా -05జూలై (మహాప్రభ,)**
సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులతో ప్రజలను మోసగిస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు. బ్యాంకు అధికారులు, ప్రభుత్వ సంస్థలు, లోన్ కంపెనీల ప్రతినిధులమంటూ ఫోన్ చేసి ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, యూపీఐ పిన్ వంటి గోప్యమైన సమాచారాన్ని అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వవద్దన్నారు. ఇటీవలి కాలంలో ఏపీకే ఫైల్స్ పంపించడం, క్యూఆర్ కోడ్‌లు స్కాన్ చేయించడం, నకిలీ లోన్ యాప్‌లు, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఓఎల్‌ఎక్స్ వంటి వేదికల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియా ద్వారా బ్లాక్‌మెయిల్ చేయడం, గిఫ్ట్ హ్యాంపర్లు, కేవైసీ అప్‌డేట్, రివార్డు పాయింట్ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు కాజేసే ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. తెలియని వ్యక్తులు పంపిన లింకులు, ఫైల్స్ లేదా యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు.
బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఓటీపీ, యూపీఐ పిన్, ఏటీఎం కార్డు వివరాలు, సీవీవీ నంబర్, పాస్‌వర్డ్ వంటి వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వస్తే వెంటనే వాటిని నిర్లక్ష్యం చేసి సంబంధిత అధికారిక సంస్థను సంప్రదించాలని తెలిపారు.
ఆర్థిక సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే, ముఖ్యంగా “గోల్డెన్ అవర్”లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తత, అవగాహన, సకాలంలో ఫిర్యాదు చేయడం కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు

## నూతన దంపతులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి.



**మెదక్ జిల్లా -05జూలై (మహాప్రభ ).**
మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్‌లో ఆదివారం ఔరంగాబాద్ కు చెందిన బీఆర్ఎస్ నాయకులు నాగన్నగారి శ్రీనివాస్ గౌడ్, సంతోష్ దంపతుల కుమార్తె నందిని వివాహం నరేష్ గౌడ్‌తో ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మా దేవేందర్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా జులై 2న పెళ్లి జరిగిన సంతోష్ కుమార్ గౌడ్ నివేదితకు కూడా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ అరేళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ కౌన్సిలర్ బీమరి కిషోర్, నాయకులు లింగారెడ్డి, కృష్ణ గౌడ్, ప్రభు రెడ్డి, రమేష్ గౌడ్, వెంక గౌడ్, సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శివంపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు కు కృషి చేస్తా

**-మంత్రి దామోదర రాజనర్సింహా**



**శివ్వంపేట,జూన్ 5(మహాప్రభ):**
ప్రజా ప్రభుత్వంలో భాగంగా గ్రామాల అభివృద్ధికి కోసం ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులు వచ్చే విధంగా కృషి చేయాలని మెదక్ జిల్లా శివంపేట మండలానికి చెందిన సర్పంచులు ముఖ్య నాయకులు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సంగారెడ్డిలో కేంద్రంలో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ వారితో మాట్లాడుతూ శివంపేట మండల అభివృద్ధి కోసం ప్రభుత్వం ద్వారా పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను, ప్రజలందరికీ వివరించే బాధ్యత ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులపై ఉందని సూచించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని మంత్రి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సుధీర్ రెడ్డి, పాలమాకుల నవీన్ గుప్తా, నర్సాపూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పెద్దపట్లోరి మాధవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సులు కుమార్, పుల్ సింగ్, సర్పంచులు, దొంతి రెడ్డి అరుణ రెడ్డి, కుమ్మరి హైమావతి ఆంజనేయులు, బుగ్గ మురళి రెడ్డి, కందగారి ఆంజనేయులు, అయ్యగారి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


## అందుబాటులో లేని హాస్టల్ వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

**- ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతున్న హాస్టల్ వార్డెన్లు.**



**దేవరకొండ డివిజన్ జూలై 5 ( మహాప్రభ )**
దేవరకొండ నిబంధనలు పాటించాలని వార్డెన్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. అని బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజవర్గం అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ దేవరకొండ, ఆదివారం. విద్యార్థులకు అందుబాటులో లేకుండా విధులు నిర్వర్తిస్తున్న హాస్టల్ వార్డెన్లపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల సంక్షేమాన్ని పక్కనపెట్టి కొందరు వార్డెన్లు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. హాస్టళ్లలో వార్డెన్లు అందుబాటులో లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను పాటించని వార్డెన్లపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన వసతి, భద్రత, అవసరమైన సౌకర్యాలు కల్పించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని బొడ్డుపల్లి కృష్ణ కోరారు.

## వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పిఎసిఎస్ జాలే నరసింహ రెడ్డి



**దేవరకొండ డివిజన్ జూలై 5 ( మహాప్రభ )**
చందంపేట మండలంలోని రేకులగ డ గ్రామానికి చెందిన శ్రీమతి శ్రీ ఎలుక సావిత్రీ శ్రీనయ్య గౌడ్ కుమార్తె మరియు కంబాలపల్లి గ్రామానికి చెందిన శ్రీమతి శ్రీ సురకారపు బక్కమ్మ వెంకటేశ్వర్లు కుమారుడు (అఖిల శ్రీను గౌడ్)ల పోలేపల్లి క్రాస్ రోడ్డు లోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శు భాకాంక్షలు తెలిపిన ప్రియతమ నాయకుడు జాలే నరసింహారెడ్డి పిసిసి సభ్యులుపిఎస్ సిఎస్. చైర్మన్ ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, ఇప్ప తిరుపతి రెడ్డి, బందెల తిరుపతయ్య, సర్పంచ్ జలంధర్, ఉప సర్పంచ్ శేఖర్, వెంకులు, శ్రీను, అంజి, మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ని కలిసిన దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ జూలై 5 ( మహా ప్రభ )**
హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి బట్టి విక్రమార్క దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక కలిశారు. ఈ సందర్భంగా “దేవరకొండ నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా, విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతం, పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సంబంధిత పనులు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్ల విస్తరణతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.” నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ కర్తవ్యమని, దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తెలిపారు.

## కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షులు డా. సత్యం శ్రీరంగంను మర్యాదపూర్వకంగా సత్కరించారు



**కూకట్పల్లి, జూలై 5 (మహ ప్రభ)**
కూకట్‌పల్లి నియోజకవర్గానికి నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగంను కైత్లాపూర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయినపల్లి డివిజన్ అధ్యక్షుడు అరవింద్ కిషోర్ నాయుడు, హస్మత్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు షేక్ గౌస్ లతీఫుద్దీన్ (షాహెన్షా), కైత్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు కలికోట శంకర్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్, మాజీ అధ్యక్షుడు కృష్ణ రాజ్‌పుత్, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, డివిజన్ మహిళా అధ్యక్షులు విజయలక్ష్మి, జ్యోతి, స్వరూప గౌడ్, విఠల్ రెడ్డి, సుంకన్న, అరుణ్ గౌడ్, శాంతితో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# కొల్లాపూర్ నియోజక వర్గంలో పలు వివాహాలకు హాజరైన

**-కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి**

**-చిన్నంబావి మండల టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు**



**వనపర్తి జిల్లా ప్రతినిధి -05జూలై (మహాప్రభ ).**
చిన్నంబావి మండల పరిధిలోని బెక్కెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కోస్కె పద్మ రాజారెడ్డి దంపతుల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బీచుపల్లి లో జరుగుతున్న వారి కుమార్తె వివాహానికి హాజరై నూతన దంపతులు నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని అక్షింతలు వేసి నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. అనంతరం వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన చనమోని రాముడు మరియు దివ్య వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ జెడ్పిటిసి కేసిరెడ్డి వెంకట్రావమ్మ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి మండలాల ఇన్చార్జి గోవిందు శ్రీధర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి సార్, ఇంద్రసేనారెడ్డి, రంజిత్ కుమార్, సుధాకర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించడం జరిగింది.

# సే నో టు డ్రగ్స్ ఎ బిగ్ ఎస్ టు లైఫ్ పోస్టర్ ఆవిష్కరణ

**-పోస్టర్ ఆవిష్కరించిన మహమ్మద్ లాల.**



**ఎల్లారెడ్డిపేట)-05జూలై (మహాప్రభ ).**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామపంచాయతీ ఆఫీసులో స్టేట్ డిప్యూటీ చైర్మన్ లాల్ మహమ్మద్ ఆధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ ఎ బిగ్ ఎస్ టు లైఫ్ పోస్టర్ ఆవిష్కరణ చేపట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫౌండర్ సయ్యద్ అబ్దుల్ కరీం హాజరయ్యారు.జాతీయ లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ అజయ్ కుమార్,అడిషనల్ డైరెక్టర్ నజీరుద్దీన్,రాష్ట్ర కార్యదర్శి మాజీద్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు,ఫౌండర్ సయ్యద్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ గత 6నెలల నుండి మన ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ అవగాహన కార్యక్రమం చేపడుతున్నాం.ప్రతి రాష్ట్రం, ప్రతి జిల్లా లో ప్రతి కాలేజ్ లో,ప్రతి స్కూల్ లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం అన్నారు.డ్రగ్స్ కు అలవాటు పడిన చాలా యువతీ,యువకులు ప్రాణాలు కోల్పోతున్నారని వాళ్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.అలాగే ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల రెండోసారి అనాథాశ్రమం,వృద్ధాశ్రమం,అన్నదానం కార్యక్రమం, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే ఎవరికి ఏ అవసరం ఉన్నా,న్యాయం కావాలంటే ప్రొటెక్షన్ ఆఫ్ లీగల్ అండ్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ వాళ్లకు అప్రోచ్ అవుతే మేము ఇన్వెస్టిగేషన్ చేసి ఆ అధికారి దృష్టికి తీసుకెళ్లి న్యాయం అయ్యేంతవరకు నిలబడి ఉంటాం అన్నారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల చైర్మన్ శ్రావణ్ కుమార్,డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ సురేందర్,వైస్ ప్రెసిడెంట్ సందీప్,డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ సెక్రటరీ పరశు రాములు ఆర్గనైజ్డ్ సెక్రటరీ అనిల్,వైస్ సెక్రటరీ మనోజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ప్రాధాన్యత కల్పించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**-మంత్రి నిర్ణయాన్ని అభినందించిన సీనియర్ జర్నలిస్ట్ పార్వతి రాజేష్ కుమార్**

**-రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి**



**మంచిర్యాల,-05జూలై (మహాప్రభ ).**
డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కేటాయింపులో మందమర్రి ప్రాంతానికి చెందిన సుమారు 20 మంది జర్నలిస్టుల కుటుంబాలను గుర్తించి వారికి ప్రాధాన్యత కల్పించిన రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామికి జర్నలిస్టు తరపున సీనియర్ జర్నలిస్ట్ పార్వతి రాజేష్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి నిరంతరం సేవలందిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి వారికి గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం సానుకూల పరిణామమని అన్నారు. మందమర్రిలో అమలు చేసిన ఈ విధానాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, అన్ని నియోజకవర్గాల్లో అర్హులైన జర్నలిస్టులను గుర్తించి డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, జర్నలిస్టులకు సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రంలో ప్రతి రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజా పాలన సాగిస్తున్నాం...

**-ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు**

**-రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

**మంచిర్యాల -05జూలై (మహాప్రభ ).**
రాష్ట్రంలోని ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజా పాలన కొనసాగించడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సంక్షేమంలో భాగంగా ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మండల కేంద్రంలో మురుగు కాలువ నిర్మాణ పనులను ప్రారంభించడం జరిగిందని, 143 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరిగిందని తెలిపారు.అర్హులైన పెంకుటిల్లు ఉన్నవారికి, సొంత స్థలం కలిగిన వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని,రేషన్ కార్డులు జారీ చేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించేలా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 36 కోట్ల రూపాయలతో 56 కిలోమీటర్ల మేర రహదారులు,రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో 63 కోట్ల రూపాయల వ్యయంతో రహదారులు నిర్మించడం జరుగుతుందని,భీమారం మండల పరిధిలో 6 కిలోమీటర్ల మేర రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అమృత్ 2.0 పథకం క్రింద ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం త్రాగునీటి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.సుమారు 100 కోట్ల రూపాయల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనంపై కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవలు సృష్టించి



ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాలో అవాస్తవాలను ప్రచారం చేస్తూ ప్రజలలో ఆందోళనలు కలిగిస్తున్నారని,ఈ విషయాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో రహదారి విస్తరణలో వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారని,1 కోటి 60 లక్షల రూపాయల డి.ఎం.ఎఫ్.టి నిధులతో బైపాస్ రోడ్డు నిర్మించడం జరుగుతుందని,1 కోటి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న 20 షాపులలో పేద వ్యాపారస్తులకు ప్రాధాన్యత ఇచ్చి కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..**
12 కోట్ల రూపాయల సి.ఎస్.ఆర్. నిధులతో చెన్నూర్ నియోజకవర్గంలో రహదారులు, మురుగు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో పాటు అన్ని గ్రామాలలో రహదారులు, మురుగు కాలువల వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సి.సి. మురుగు కాలువలలో మ్యాజిక్ సోక్ ఫీట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, తద్వారా భూగర్భ జల శాతాన్ని పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులతో భీమారంలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మైనారిటీ సంక్షేమ వసతి గృహంలో మధ్యాహ్న భోజనం విషయంలో ఏర్పడిన గందరగోళంలో ఎలాంటి వాస్తవం లేదని, కొంతమంది ఉద్దేశపూర్వకంగా పిల్లలతో అబద్ధాలు చెప్పించారని, సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యారంగంలో మంచిర్యాల జిల్లా 3వ స్థానంలో ఉందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు ఇతర ప్రభుత్వ సంబంధిత విద్యా సంస్థలలో ఈ సంవత్సరం నో అడ్మిషన్ బోర్డులు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 3 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాల అభివృద్ధి ప ప్రత్యేక దృష్టి సారిస్తుందని, విద్యాసంస్థలలో సి.సి. కెమెరాల తో పర్యవేక్షించడం జరుగుతుందని, విద్యార్థులకు 200 శాతం కాస్మోటిక్, 40 శాతం డైట్ చార్జీలు పెంచి అందించడం జరుగుతుందని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాలలు, అదనపు తరగతి గదులు నిర్మించడం జరుగుతుందని,ఆర్.ఓ. ప్లాంట్లు ఏర్పాటుచేసి శుద్ధమైన త్రాగునీటిని అందిస్తున్నామని తెలిపారు.

**చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో**
ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారు నిర్మించుకున్న ఇంటిని జిల్లా కలెక్టర్, అధికారులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గానికి 3 వేల 500 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పుడు మరో 2 వేల ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హత గల ప్రతి ఒక్కరికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో పెంకుటిల్లు లేకుండా ప్రతి ఒక్కరికి పక్కా ఇల్లు ఉండే విధంగా ప్రభుత్వం అర్హులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తుందని, పెంకుటిల్లు గల అర్జీదారులు చేసుకున్న దరఖాస్తును మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పరిశీలించి ఫోటోలు తీసుకుని అర్హత ప్రమాణాలు పరిశీలించి ఇల్లు కేటాయించాలని తెలిపారు.రాష్ట్రంలో ఇసుక మాఫియా అరికట్టడంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మీ ఓటు - మీ బలం.

**-ఇందారంలో మస్జిద్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్యం.**


**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, -05జూలై (మహాప్రభ ).**
ఆదివారం ఉదయం జైపూర్ మండలం ఇందారం గ్రామం లోని జామా మస్జిద్ ప్రాంగణం కొత్త కళ సంతరించుకుంది. ప్రార్థనల కోసమే కాకుండా ప్రజాస్వామ్య బాధ్యత కోసం కూడా ఆ ప్రాంగణం వేదికైంది. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ఓటరు సవరణ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మస్జిద్ అధ్యక్షులు మహమ్మద్ మొయిజుద్దీన్ నేతృత్వంలో ఉదయం నుంచే కమిటీ సభ్యులు ప్రజలకు సేవలందించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రజాస్వామ్యంలో ఓటు మనందరి బలం. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు



ఓటరు జాబితాలో ఉండాలి. ఇది మనందరి బాధ్యత అంటూ మొయిజుద్దీన్ వచ్చిన వారికి అవగాహన కల్పించారు. మీ ఓటరు కార్డులో పేరు, చిరునామా ఒకసారి సరిచూసుకోండి. తప్పులుంటే ఇప్పుడే సరిచేయించుకోండి. ఇంట్లో 18 ఏళ్లు నిండిన పిల్లలుంటే వారికి కొత్త ఓటు నమోదు చేయించండి. ప్రభుత్వం కల్పించిన ఈ మంచి అవకాశాన్ని అందరూ వాడుకోవాలి. బలమైన ప్రజాస్వామ్యానికి మనమంతా పునాదులు వేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. ఈ సహాయ కేంద్రంలో మస్జిద్ ఉపాధ్యక్షులు మహమ్మద్ అశ్ఫఖ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అన్వర్ అలీతో పాటు కమిటీ సభ్యులు స్వయంగా దరఖాస్తు ఫారాలు నింపి ఇచ్చారు. ఏ పత్రాలు కావాలో చెప్పి, అంతర్జాలంలో ( ఆన్లైన్ ద్వారా) దరఖాస్తు చేసే వారికి తోడుగా నిలిచారు. వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సందేహాలు నివృత్తి చేసుకున్నారు. స్థానికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను సరిచేసుకున్నారు. మస్జిద్ కమిటీ వారు మంచి పని చేశారు. మాకు తెలియని విషయాలు చెప్పి, ఫారాలు నింపడంలో సాయం చేశారు' అని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# రెనో 16, రెనో 16 సి మోడళ్లతో రెనో 16 సిరీస్‌ను విడుదల..

**బషీర్ బాగ్, -05జూలై (మహాప్రభ ).**




ఒప్పో ఇండియా సంస్థ నేడు రెనో 16, రెనో 16 సి మోడళ్లతో కూడిన రెనో 16 సిరీస్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇవి భారతదేశపు మొట్టమొదటి హోలోవర్స్ 3 డి డిజైన్, 50 ఎంపీ 3.5 ఎక్స్ టెలిఫోటో లెన్స్‌తో కూడిన ఏఐ పోర్ట్రెయిట్ కెమెరా, నేచురల్ టోన్ ఇమేజింగ్ అన్ని ఫోకల్-లెంగ్త్ 4 కె 60 ఎఫ్పిఎస్ హెచ్డీఆర్ వీడియో రికార్డింగ్ ఫీచర్లను కలిగి ఉన్నాయనీ పేర్కొంది. స్మార్ట్‌ఫోన్‌ను కేవలం సమాచార సాధనంగా మాత్రమే కాకుండా, అంతకు మించి భావించే యువత కోసం రూపొందించబడిన ఈ రెనో 16 సిరీస్, అద్భుతమైన కెమెరా, సృజనాత్మకతకు నిలయమైన స్టూడియో, పనులను సులభతరం చేసే భాగస్వామి వ్యక్తిగత సహాయకుడిగా సమర్థవంతంగా పనిచేస్తుందనీ వెల్లడించింది.ఏఐ రీమిక్స్ కాలేజ్, పి ఓ పి కెమెరా, పాఫ్ ఔట్ 2.0 వంటి ఏఐ పవర్డ్ ఫీచర్లతో అద్భుతమైన కంటెంట్‌ను రూపొందించడం నుండి, కలర్స్ ఓఎస్ 16 అందించే స్మార్ట్ ఫీచర్లను ఉపయోగించడం నుంచి, ఈ రెనో 16 సిరీస్ వినియోగదారులు సులభంగా కొత్త కంటెంట్‌ను రూపొందించేందుకు, ఇతరులతో కనెక్ట్ కావడానికి, తమ ఆలోచనలు భావాలను వ్యక్తపరచడానికి తోడ్పడుతుందనీ పేర్కొంది.

# సంకలనం ముద్రణకు 'ప్రజానేత రావాలి' కవిత ఎంపిక..

**మంచిర్యాల - 05జూలై (మహాప్రభ ).**



మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, కవి మట్టె రవీందర్ రాసిన కవిత సంకలనం ముద్రణకు ఎంపికైంది. తెలుగు వెలుగు జాతీయ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో 'ప్రజానేత రావాలి' అనే శీర్షికతో రవీందర్ కవిత పంపారు. మొత్తం 220 మంది ప్రముఖ కవులు పోటీల్లో పాల్గొన్నారు. వీటిలో కొన్ని కవితలు విజేతలుగా నిలవగా 109 మంది కవులు రాసిన కవితలు సంకలనం ముద్రణకు ఎంపికయ్యాయి. ఇందులో రవీందర్ కవిత సైతం ముద్రణకు ఎంపిక కావడం పట్ల జిల్లా జర్నలిస్టులతో పాటు పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రవీందర్ ను ప్రత్యేకంగా అభినందించారు.

# బిజినెస్

## బంగారం ధరలు మళ్లీ పెరుగుదల బాటలో.. కొనుగోలుదారుల్లో ఆందోళన

**న్యూఢిల్లీ, జూలై 5:**
గత వారం స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు మళ్లీ పెరుగుదల దిశగా పయనిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, డాలర్ మారకం విలువలో మార్పులు, అలాగే పెట్టుబడిదారుల కొనుగోళ్లు పెరగడంతో దేశీయ మార్కెట్లో కూడా బంగారం ధరలు పెరిగాయి. 22 క్యారెట్లు, 24 క్యారెట్ల బంగారం ధరలు పలు నగరాల్లో గ్రాముకు పెరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. గత నెలలో నమోదైన భారీ తగ్గుదల తర్వాత ప్రస్తుతం ధరలు తిరిగి కోలుకుంటున్నాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులు ధరలపై నిశితంగా గమనిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, అమెరికా వడ్డీ రేట్లపై అంచనాలు, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి



అంశాలు బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సమీప కాలంలో ధరల్లో స్వల్ప హెచ్చుతగ్గులు కొనసాగవచ్చని వారు పేర్కొంటున్నారు. పెళ్లిళ్లు, పండుగల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి. అవసరాన్ని బట్టి కొనుగోలు నిర్ణయం తీసుకోవాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

## టాటా ఈవీలపై భారీ తగ్గింపు:

-రూ. 3.35 లక్షల వరకు ఆదా!




ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాలను పెంచుకునేందుకు దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ భారీ డిస్కౌంట్లను ప్రకటించింది. ఎంపిక చేసిన మోడళ్లపై గరిష్ఠంగా రూ. 3.35 లక్షల వరకు ప్రయోజనాలు అందిస్తోంది. టాటా కర్వ్ ఈవీపై రూ.3.35 లక్షల వరకు, హారియర్ ఈవీపై రూ.2.75 లక్షల వరకు, పంచ్ ఈవీపై రూ.1.45 లక్షల వరకు, టియాగో ఈవీపై రూ.1.45 లక్షల వరకు తగ్గింపులు అందుబాటులో ఉన్నాయి. ఈ ఆఫర్లలో నగదు తగ్గింపు, ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ ప్రయోజనాలు, లాయల్టీ ఇన్సెంటివ్‌లు ఉన్నాయి.

## రూ.4 లక్షల కంటే తక్కువ ఆదాయం ఉన్నా పన్ను చెల్లించాలా?




వార్షిక ఆదాయం రూ.4 లక్షల కంటే తక్కువగా ఉందని ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయాల్సిన అవసరం లేదనుకోవడం సరైంది కాదు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో తక్కువ ఆదాయం ఉన్నవారూ తప్పనిసరిగా ITR దాఖలు చేయాలి. భారీ మొత్తంలో బ్యాంకు లావాదేవీలు, విదేశీ పర్యటనలపై అధిక వ్యయం, అధిక విద్యుత్ బిల్లులు వంటి నిర్దిష్ట ఆర్థిక లావాదేవీలు చేసినా రిటర్న్ సమర్పించాల్సి ఉంటుంది. అలాగే ఋణా రీఫండ్ పొందడం, భవిష్యత్తులో రుణాలు, వీసా దరఖాస్తులు లేదా ఆర్థిక రికార్డును బలోపేతం చేసుకోవడానికి కూడా ITR దాఖలు చేయడం ఉపయోగకరం. ఆన్‌లైన్‌లో రిటర్న్ సమర్పించిన తర్వాత ఈ–వెరిఫికేషన్ పూర్తి చేయడం తప్పనిసరి.

## వ్యాపార రంగంలో మార్పులు.. చిన్న వ్యాపారులకు కొత్త అవకాశాలు

**హైదరాబాద్, జూలై 5**
దేశీయ వ్యాపార రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులు చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు కొత్త అవకాశాలను తెరుస్తున్నాయి. డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరగడం, ఈ–కామర్స్ విస్తరణ, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలతో వ్యాపార రంగంలో పోటీ మరింత పెరుగుతోంది. ప్రస్తుతం వినియోగదారుల కొనుగోలు విధానంలో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్‌కు ప్రాధాన్యం పెరగడంతో సంప్రదాయ వ్యాపారులు కూడా డిజిటల్ వేదికలను ఆశ్రయిస్తున్నారు. యూపీఐ, క్యూ ఆర్ కోడ్ చెల్లింపులు సాధారణమవడంతో నగదు లావాదేవీలు తగ్గుముఖం పట్టాయి. మరోవైపు, చిన్న పరిశ్రమలకు బ్యాంకుల నుంచి రుణాల లభ్యత మెరుగుపడుతున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. తక్కువ వడ్డీ రుణాలు, ప్రభుత్వ



ప్రోత్సాహక పథకాలతో కొత్త వ్యాపారాలు ప్రారంభించేందుకు యువత ఆసక్తి చూపుతోంది. పరిశ్రమ నిపుణుల అభిప్రాయం ప్రకారం, డిజిటల్ మార్కెటింగ్, నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన వినియోగదారుల సేవలను అందించే సంస్థలు మార్కెట్లో నిలదొక్కుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సాంకేతికతను అందిపుచ్చుకున్న వ్యాపారాలు వేగంగా అభివృద్ధి సాధిస్తున్నాయని వారు చెబుతున్నారు. అయితే ముడి పదార్థాల ధరల పెరుగుదల, రవాణా వ్యయాలు, పెరుగుతున్న పోటీ వంటి అంశాలు వ్యాపారులకు సవాళ్లుగా మారుతున్నాయి. అయినప్పటికీ కొత్త మార్కెట్ల అన్వేషణ, ఆన్‌లైన్ విక్రయాల విస్తరణ ద్వారా ఈ సవాళ్లను అధిగమించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**సారాంశం:** వ్యాపార రంగంలో వస్తున్న మార్పులను వేగంగా స్వీకరించి, సాంకేతికతను వినియోగించే సంస్థలకే భవిష్యత్తులో అధిక వృద్ధి అవకాశాలు ఉండనున్నాయని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# స్పోర్ట్స్

## బాబర్‌తో బంతాట.. మసూద్‌పై వేటుతో మళ్లీ కెప్టెన్సీ..!

అనిశ్చితికి మారుపేరైన ఆటతోనే కాదు వివాదాస్పద నిర్ణయాలతోనూ వార్తల్లో నిలిచే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మరోసారి వైరలవుతోంది. విదేశీ సిరీస్ ముగియడమే ఆలస్యం కెప్టెన్లను మార్చే పీసీబీ మళ్లీ బాబర్ ఆజాంతో బంతాట ఆడుతోంది. ఒకప్పుడు కెప్టెన్‌గా ఉన్న బాబర్‌ను ఆటగాడిగా పరిమితం చేసిన పాక్ బోర్డు.. మళ్లీ అతడికి పగ్గాలు అప్పగించింది. వరసగా విఫలవుతున్న షాన్ మసూద్ స్థానంలో బాబర్‌కు సారథ్యం అప్పగించారు సెలెక్టర్లు. వెస్టిండీస్, ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లకు బాబర్ కెప్టెన్‌గా ఆదివారం స్క్వాడ్‌ను ప్రకటించింది పీసీబీ.పాకిస్థాన్ కెప్టెన్‌గా బాబర్ ఆజాం తిరిగొచ్చాడు. మూడేళ్ల క్రితం టెస్టు సారథ్యాన్ని కోల్పోయిన అతడు మళ్లీ వెస్టిండీస్ పర్యటనతో జట్టును నడిపించనున్నాడు. షాన్ మసూద్ నాయకత్వంలో పాక్ వరస పరాజయాల నేపథ్యంలో పీసీబీ ఈ నిర్ణయం తీసుకుంది. 16 మ్యాచుల్లో 12 పరాజయాలు, డబ్ల్యూటీసీలో వెనుకంజతో ఆగ్రహించిన అభిమానులు, మాజీ ఆటగాళ్లు



మసూద్‌ను తప్పించాలని డిమాండ్ చేశారు. దాంతో, అనుభవజ్ఞుడైన బాబర్‌వైపు సెలెక్టర్లు మొగ్గు చూపారు.

**జూలై 25 నుంచి**
వెస్టిండీస్‌తో రెండు టెస్టుల సిరీస్ కోసం ఆదివారం బాబర్ సారథిగా 16 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. అయితే.. ఇంగ్లండ్ పర్యటనకు 17వ సభ్యుడిగా సాద్ షకీల్‌ను తీసుకున్నారు. జూలై 25 నుంచి పాక్, విండీస్ మధ్య తొలి టెస్టు జరుగనుంది. పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో జూలై 29 నుంచి రెండో మ్యాచ్ ఉంటుంది. అనంతరం పాక్ జట్టు మూడు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లండ్‌కు వెళ్తుంది. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 13 వరకూ లీడ్స్ లార్డ్స్, బర్మింగ్‌హమ్‌లో ఆతిథ్య జట్టుతో బాబర్ సేన తలపడనుంది. పాకిస్థాన్ స్క్వాడ్ (వెస్టిండీస్, ఇంగ్లండ్ సిరీస్‌కు) : బాబర్ ఆజాం(కెప్టెన్), అమిర్ జమల్, అబ్దుల్లా ఫజల్, అలీ ఉస్మాన్, అజన్ అవైస్, ఇమాముల్ హక్, ఖుర్రం షహజాద్, మొహమ్మద్ అబ్బాస్, మొహమ్మద్ అలీ, రిజ్వాన్(వికెట్ కీపర్), మొహమ్మద్ అవైస్ జఫర్, ముహమ్మద్ ఘాజీ ఘోరీ(వికెట్ కీపర్), సాజిద్ ఖాన్, సల్మాన్ అలీ అఘా, షాన్ మసూద్, ఉబైద్ షా.

## మెస్సీని వదలని ఎంబాపే.

-ఆసక్తిరేపుతున్న గోల్డెన్ బూట్ రేసు..!





అమెరికా, కెనడా, మెక్సికో సంయక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026లో 'గోల్డెన్ బూట్' రేసు ఆసక్తి రేపుతోంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనల్ మెస్సీ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. కిలియన్ ఎంబాపే 'నేను ఉన్నానంటూ' దూసుకొచ్చాడు. శనివారం వరకూ మెస్సీ ఏడు గోల్స్‌తో టాప్‌లో ఉండగా ఎంబాపే సైతం అతడి సరసన చేరాడు.గోల్డెన్ బూట్ కోసం ఈసారి కూడా గట్టిపోటీ నెలకొంది. 16వ రౌండ్‌లో పరాగ్వేపై పెనాల్టీని గోల్‌గా మలిచిన ఎంబాపే, మెస్సీతో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. నాకౌట్‌లో అర్జెంటీనా, ఫ్రాన్స్ మరిన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశమున్నందున గోల్డెన్ బూట్ కోసం మెస్సీ, ఎంబాపేల మధ్యే పోటీ ఉండనుంది.సాకర్ వరల్డ్‌కప్‌లో అత్యధిక గోల్స్ వీరుడిని గోల్డెన్ బూట్‌తో సత్కరించడం ఆనవాయితీ. ఈసారి ఈ బూట్ కోసం దిగ్గజం లియోనల్ మెస్సీకి, కిలియన్ ఎంబాపే నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతోంది. గత ఎడిషన్‌లో(2022) గోల్డెన్ బూట్‌ను తన్నుకుపోయిన ఎంబాపే ఈ దఫా రేసులోనే ఉన్నాడు. క్రిస్టియానో రొనాల్డో(పోర్చుగల్) వెనకబడగా.. ఏడు గోల్స్‌తో మెస్సీతో సరిసమానంగా నిలిచాడీ ఫ్రాన్స్ ఫార్వర్డ్ ఆటగాడు.తొలి మ్యాచ్‌లోనే అల్జీరియాపై హ్యాట్రిక్ గోల్స్ చేసిన అర్జెంటీనా కెప్టెన్.. మొత్తంగా నాలుగు మ్యాచుల్లో ఏడు గోల్స్ సాధించాడు. లెజెండరీ ఆటగాడిగా ఎదుగుతున్న ఎంబాపే సైతం 5 మ్యాచుల్లో ఏడు గోల్స్‌తో గోల్డెన్ బూట్ రేసులో నిలిచాడు. హ్యారీ కేన్(ఇంగ్లండ్), ఎర్లింగ్ హోలాండ్(నార్వే)లు.. ఐదేసి గోల్స్‌తో సంయుక్తంగా మూడో స్థానంలో కొనసాగుతున్నారు.


## అయ్యర్ కెప్టెన్సీలో హ్యాట్రిక్ ఓటములు..

-నెట్టింట వైరలవుతున్న ఆర్సీబీ కెప్టెన్..!

టీ20ల్లో తిరుగులేని శక్తిగా ఉన్న భారత జట్టు ఇప్పుడు వరసగా ఓడిపోతోంది. కొత్త కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ నిర్ణయాలు బెడిసికొడుతుండగా ఐర్లాండ్ చేతిలో మొదటిసారి వైట్‌వాష్..ఆపై ఇంగ్లండ్ గడ్డపై ఓటమి. టీమిండియా సారథిగా తొలి విజయం కోసం అయ్యర్ నిరీక్షిస్తుండగా.. నెట్టింట రజత్ పటిదార్ పేరు మార్మోగిపోతోంది. ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వరసగా రెండు సీజన్లలో ఛాంపియన్‌గా నిలిపిన పటిదార్‌కు అన్యాయం జరిగిందని పలువురు పోస్టులు పెడుతున్నారు.ఐపీఎల్‌లో విజయవంతమైన శ్రేయాస్ అయ్యర్ టీమిండియా టీ20 సారథిగా మాత్రం తేలిపోతున్నాడు. జట్టు కూర్పు నుంచి మైదానంలో వ్యూహాలు పన్నడంలోనూ అయ్యర్ విఫలమవ్వడం చూస్తున్నాం. అందుకు మొదటి సిరీస్‌లోనే 2-0తో ఐర్లాండ్ క్లీన్‌స్వీప్ చేయడం అయ్యర్ కెప్టెన్సీలో మాయని మచ్చే. ఈ ఓటమి నుంచి తేరుకుందామనుకుంటే ఇంగ్లండ్‌పైనా పరాజయమే పలకరించింది.ఓపెనర్ అభిషేక్ శర్మ నుంచి లోయర్ ఆర్డర్లో అర్ష్‌దీప్ సింగ్ వరకూ .. బ్యాటింగ్ ఆర్డర్‌లో



ఏకంగా ఆరుగురు లెఫ్ట్ హ్యాండర్లే ఉండడం వ్యూహాత్మక తప్పిదమని విశ్లేషకులు చెబుతున్నారు. ఐపీఎల్ తరహాలో టీమిండియాను గెలుపు తోవ తొక్కించలేకపోతున్న అయ్యర్‌పై నెట్టింట విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదే సమయంలో ఆర్సీబీ ట్రోఫీ కలను సాకారం చేసిన రజత్ పాటిదార్‌కు బీసీసీఐ అన్యాయం చేసిందని పలువులురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ సైతం పటిదార్‌కు మద్దతు పలికాడు.'ప్రస్తుతం భారత జట్టు బ్యాటింగ్ లైనప్‌లో ఆరుగురు ఎడమ చేతివాటం ఆటగాళ్లు ఉన్నారు. ఐపీఎల్‌లో వరసగా రెండు ట్రోఫీలు గెలుపొందిన కెప్టెన్ రజత్ పటిదార్ ఉండగా అతడిని ఎందుకు ఎంపిక చేయలేదు. పైగా అతడు భీకర ఫామ్‌లో ఉన్నాడు. పటిదార్‌కు త్వరలోనే అవకాశం వస్తుందని నేను ఆశిస్తున్నా. ఎందుకుంటే.. వచ్చే పొట్టి ప్రపంచకప్ కోసం ప్రయోగాలు చేసేందుకు టీమిండియాకు చాలా సమయం ఉంది' అని ఇర్ఫాన్ పేర్కొన్నాడు.



## గత్తరలేపిన రెజీనా కాసాండ్రా..

### అమ్మడి ఫోటోలకు ఫిదా అవ్వాల్సిందే..

రెజీనా కాసాండ్రా.. ఈ అందాల భామ ఒకానొక సమయంలో టాప్ హీరోయిన్ గా రాణించింది. ప్రస్తుతం ఈ అమ్మడు తెలుగు, తమిళం,కన్నడ సినిమాల్లో నటిస్తూ అలరిస్తుంది. ఈ ముద్దుగుమ్మ 1990 డిసెంబర్ 13న చెన్నైలో జన్మించింది. చిన్న వయస్సులోనే సినిమా రంగంలోకి అడుగుపెట్టిన రెజీనా, 2005లో తమిళ చిత్రం "కండా నాల్ ముదల్"తో తన నటనా జీవితాన్ని ప్రారంభించింది.తెలుగులో "శివ మనసులో శృతి" ద్వారా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ఆమె నటనకు "సైమా ఉత్తమ తొలి చిత్ర నటి" అవార్డు కూడా వచ్చింది. రెజీనా తెలుగులో "రొటీన్ లవ్ స్టోరీ", "పిల్లా నువ్వు లేని జీవితం", "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్", "పవర్" వంటి సినిమాల్లో నటించి క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. తమిళంలో "కేడి బిల్లా కిల్లాడి రంగా", "మానగరం" వంటి చిత్రాల్లో ఆమె నటన ప్రశంసలు పొందింది.ఈ బ్యూటీ విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటుంది. "సుబ్రహ్మణ్యం ఫర్ సేల్"లో సాంప్రదాయ అమ్మాయి, "జ్యో అచ్యుతానంద"లో స్టూడెంట్, "అ"లో డ్రగ్ అడిక్ట్ వంటి పాత్రల్లో తన సత్తా చాటింది. ఈ భామ బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెట్టింది. 2019లో "ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా" చిత్రంతో హిందీలో ప్రవేశించింది. తాజాగా విడుదలైన సన్నీ డియోల్ "జాట్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. అలాగే, వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తూ తన సత్తా చాటుతుంది.గతంలో రెజీనా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆమె మాట్లాడుతూ.. ప్రశాంత్ వర్మ డైరెక్షన్ లో వచ్చిన "అ" సినిమా స్క్రిప్ట్ చెప్పారు. నాకు హీరోయిన్‌గా ఛాన్స్ ఇస్తే చేస్తా.. లేదా ఏదైనా కీలకమైన , నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్ర ఇస్తే చేస్తా అని చెప్పిందట.. అయితే హీరోయిన్ గా ఇప్పటికే కాజల్ ను ఫిక్స్ చేశాం అని చెప్పారు. సరే మరో బలమైన పాత్ర ఇవ్వమని అడిగాను. లేదంటే సినిమా చేయను అని తెగేసి చెప్పా అని తేలింది.దాంతో మీరా అనే పాత్ర ఇచ్చినట్టు తెలిపింది రెజీనా. అలాగే రీసెంట్ గా వచ్చిన జాట్ సినిమాలోనూ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేయమన్నారు. నాకు భారతి రోల్ ఇస్తేనే చేస్తానన్నాను అని చెప్పా దాంతో నాకు ఆ పాత్ర ఇచ్చారు అని తెలిపింది. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం రెజీనా ఆచితూచి సినిమాలు చేస్తూ మెప్పిస్తుంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటూ అభిమానులను అలరిస్తుంది.


## 'రౌడీ జనార్ధన'లో బాలీవుడ్ భామ..

### లైగర్ బ్యూటీతో మళ్లీ రౌడీ స్టార్ రొమాన్స్?




టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండ, క్రేజీ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రౌడీ జనార్ధన' గురించి రోజుకో ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. పక్కా గ్రామీణ నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ సరసన జాతీయ అవార్డు గ్రహీత, స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ తెగ హల్‌చల్ చేస్తోంది. ఈ చిత్రంలో ఒక అదిరిపోయే మాస్ స్పెషల్ సాంగ్ ప్లాన్ చేస్తున్నారట. ఈ స్పెషల్ సాంగ్‌లో విజయ్ దేవరకొండతో కలిసి బాలీవుడ్ బ్యూటీ అనన్యా పాండే స్టెప్పులు వేయబోతున్నట్లు గట్టిగా వినిపిస్తోంది. గతంలో వీరిద్దరూ 'లైగర్' సినిమాలో కలిసి నటించిన సంగతి తెలిసిందే, ఒకవేళ ఈ వార్త నిజమైతే మరోసారి ఈ జోడి వెండితెరపై సందడి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ స్పెషల్ సాంగ్ ఆఫర్‌కు అనన్య గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా లేదా అనేది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించేలా ఉంటాయని ఇన్సైడ్ టాక్. ముఖ్యంగా ఈ ఫ్లాష్ బ్యాక్‌లో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఊరమాస్ లుక్‌తో కనిపించబోతున్నాడట. ఇందులో వచ్చే యాక్షన్ సీక్వెన్సులు సినిమా మొత్తానికే మేజర్ హైలైట్‌గా నిలుస్తాయని చిత్ర యూనిట్ భావిస్తోంది. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో సీనియర్ యాంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్ ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రతో పాటు లుక్ కూడా ఇప్పటివరకు మనం చూడని రీతిలో సరికొత్తగా, ఎంతో పవర్‌ఫుల్‌గా డిజైన్ చేశారట. మొత్తానికి భారీ తారాగణం, అదిరిపోయే యాక్షన్ ఎలిమెంట్స్, విలేజ్ బ్యాక్‌డ్రాప్ స్టోరీతో తెరకెక్కుతున్న 'రౌడీ జనార్ధన' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులను సృష్టిస్తుందో చూడాలి.

## నా అలవాటు మార్చుకోను



ఎన్ఐఏ ఏజెంట్ వైష్ణవిగా 'స్పై' సినిమాతో తెలుగు చిత్రసీమకు పరిచయమైన నటి ఐశ్వర్య మేనన్. ఆ తరువాత 'భజే వాయు వేగమ్'తో మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆ రెండు చిత్రాలూ ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోయినా.. తనకంటూ ఫ్యాన్ ఫాలోయింగ్ పెంచుకున్నది ఈ భామ. ఒకవైపు కన్నడ, తమిళ్, మలయాళ సినిమాల్లో నటిస్తూనే మరోవైపు టాలీవుడ్‌లోనూ పాగావేసిన ఈ ముద్దుగుమ్మ ఈసారి 'నాగబంధం'తో రంగంలోకి దిగింది. ఈ సందర్భంగా ఆమె పంచుకున్న కార్‌వాన్ కబుర్లు ఇవి.మాది వాస్తవానికి కేరళం రాష్ట్రం. కొన్ని కారణాల వల్ల తమిళనాడులోని ఈరోడ్‌కు వలసొచ్చి అక్కడే స్థిరపడ్డాం. దీంతో నా బాల్యమంతా తమిళనాడులోనే గడిచింది. బీటెక్ వరకు చదువుకున్న నాకు సినిమాల్లో నటించాలనే బలమైన కోరిక ఉండేది. ఆ ఆసక్తితోనే అవకాశాల కోసం ప్రయత్నించి కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చాను. నాకు సంతోషం వచ్చినా, బాధ కలిగినా సోషల్‌మీడియాలో వ్యక్తం చేయడం అలవాటు. బాధకంటే ఆనందాన్నే ఎక్కువగా పంచుకుంటాను. ఓ సందర్భంలో నా ఫొటోలను పోస్ట్ చేయగా.. సినిమా ఆఫర్ల కోసం ఇలాంటి ఫొటోలు పోస్ట్ చేస్తుందని చాలామంది బ్యాడ్ కామెంట్లతో విమర్శించారు. నన్ను ద్వేషించేవారికి నేను చెప్పేది ఒక్కటే. మీరు ఎగతాళి చేసినా, విమర్శించినా ఒకరికోసం నా అలవాటును మార్చుకోను. ఇతర భాషల్లో చేస్తున్న సినిమాలు మంచి ఆదరణకు నోచుకుంటున్నాయి. అందుకే తెలుగులోనూ నా టాలెంట్‌ను నిరూపించుకునేందుకు వచ్చాను. గతంలో నేను నటించిన రెండు టాలీవుడ్ సినిమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయాయి. అయినా కూడా ఇక్కడ నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తునే ఉన్నాను. విజయానికి ముందు ఓటమి ఎదురవుతుందంటారు కదా. ఆ పాలసీనే నేను ఫాలో అవుతున్నా. కచ్చితంగా సక్సెస్ అవుతా. 'నాగబంధం' ప్రేక్షకులను సరికొత్త ఆధ్యాత్మిక, అడ్వెంచర్ ప్రపంచంలోకి తీసుకెళ్లేలా రూపొందిన సినిమా. అనంత పద్మనాభస్వామి ఆలయం, అక్కడి నాగబంధం రహస్యాల కాన్సెప్ట్ ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. విరాట్ కర్ణ, నభా నటేశ్‌లతో కలిసి సినిమాలో నటించడం కొత్త అనుభూతినిచ్చింది.నా అభిమాన నటుడు మలయాళం మెగాస్టార్ మమ్ముట్టి గారే. ఆయనతో ఒక్కసారైనా నటించాలనే కోరిక ఉండేది. ఆ అవకాశం అంత త్వరగా వస్తుందని అస్సలు ఊహించలేదు. ఆయనతో కలిసి నటించడాన్ని నేను ఎన్నటికీ మరిచిపోలేను. మమ్ముట్టి నటించిన బజూకా సినిమాలో నేను కీలకపాత్ర పోషించాను. ఈ చిత్రంలో నా నటనకు మంచి మార్కులే పడ్డాయి.



## అది నిజం కాదు


తన సినిమాపై సాంఘిక మాధ్యమంలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై కథానాయిక కీర్తి సురేశ్ కౌంటరిచ్చింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా రూపొందుతున్న భారీ చిత్రంలో కీర్తి సురేశ్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆమె వెంకటేష్ జోడీగా నటిస్తున్నది. ఈ సినిమా.. మలయాళంలో 2024లో వచ్చిన 'గురువాయూర్ అంబలనాదయిల్' చిత్రం రీమేక్‌గా తెరకెక్కుతున్నదని ఇన్‌స్టాలో ఎవరో పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్ వైరల్‌గా మారింది. దానికి కీర్తి సురేశ్ స్పందిస్తూ.. 'అందులో ఏ మాత్రం నిజం లేదు.ఇది కొత్త కథ. అందరూ మెచ్చే కథ' అంటూ కామెంట్ పెట్టింది. దీంతో వెంకీ, కల్యాణ్‌రామ్ చిత్రంపై వస్తున్న గాలి వార్తలకు చెక్ పెట్టినట్టయింది. రాయలసీమ నేపథ్యంలో, అనిల్ మార్క్ కామెడీతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందుతున్నది. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈచిత్రానికి 'జనవరి 13న విడుదల' అనే టైటిల్‌ని కూడా అనుకుంటున్నారు.

## మరో బయోపిక్‌తో అదరగొట్టనున్న ఆర్. మాధవన్..




'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా జాతీయ స్థాయిలో సంచలన విజయాన్ని అందుకున్న నటుడు ఆర్. మాధవన్, ఇప్పుడు మరో ప్రతిష్టాత్మక బయోపిక్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. భారతదేశపు గొప్ప ఆవిష్కర్త, ఇంజనీర్ మరియు 'ఇండియాస్ ఎడిసన్' అని పిలవబడే గోపాలస్వామి దొరైస్వామి నాయుడు (జి.డి. నాయుడు) బయోపిక్‌లో నటిస్తున్నాడు మాధవన్. 'G.D.N అనే టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది.బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో సాగే పీరియాడిక్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. భారతదేశంలో మొట్టమొదటి ఎలక్ట్రిక్ మోటారును తయారు చేసిన జి.డి. నాయుడు.. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు, ఆవిష్కరణల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ట్రైలర్‌లో మాధవన్ యువకుడిగా మరియు వృద్ధుడిగా రెండు విభిన్న గెటప్‌లలో కనిపించి షాక్ ఇచ్చారు. ముఖ్యంగా వృద్ధుడి పాత్రలో ఆయనను గుర్తుపట్టలేనంతగా ప్రొస్థెటిక్ మేకప్‌తో అద్భుతంగా రూపాంతరం చెందారు. "బ్రిటిషర్లు భయపడ్డారు.. సొంత దేశస్థులు మర్చిపోయారు" అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది.వీశీజఱవం ఈ చిత్రంలో మాధవన్‌తో పాటు సత్యరాజ్, జయరామ్, ప్రియమణి, దుషారా విజయన్, వినయ్ రాయ్, తంబి రామయ్య వంటి భారీ తారాగణం కీలక పాత్రలు పోషిస్తున్నారు. కృష్ణకుమార్ రామకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మాధవన్ స్వయంగా స్క్రీన్‌ప్లే అందించడం విశేషం. వర్గీస్ మూలన్ పిక్చర్స్ మరియు మాధవన్ స్వంత బ్యానర్ ట్రైకలర్ ఫిల్మ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. '96' ఫేమ్ గోవింద్ వసంత అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, అరవింద్ కమలనాథన్ సినిమాటోగ్రఫీ విజువల్స్ ట్రైలర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 17, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## NBK 111 డిసెంబర్‌లోనే?



అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. NBK 111' వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ భారీ యాక్షన్ డ్రామా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఇందులో బాలకృష్ణ పోషిస్తున్న పాత్రలో రెండు కోణాలుంటాయని, ఒక కోణంలో ఆయన అండర్‌వరల్డ్ డాన్‌గా కనిపిస్తే, మరో కోణంలో ఓ గొప్ప వంశానికి చెందిన వ్యక్తిగా, పేదలపాలిటి పెన్నిధిగా అగుపిస్తారట. ఇటీవలే ముంబైలో ఈ సినిమా భారీ షెడ్యూల్ పూర్తి చేసుకున్నది.ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. బాలకృష్ణ, మంచు మనోజ్, కాజల్ అగర్వాల్, శరత్‌కుమార్, నరేశ్ తదితరులు ఈ షూట్‌లో పాల్గొంటున్నారు. ఈ సినిమాను సంక్రాంతికి విడుదల చేయాలని చిత్ర నిర్మాత వెంకటసతీశ్ కిలారు ముందుగా భావించారు. అయితే.. నిర్మాణం త్వరగా పూర్తి కానుండటం, సంక్రాంతి సీజన్‌లో పోటీ అధికంగా ఉండటం తదితర కారణాల దృష్ట్యా ఒక నెల ముందే, అంటే డిసెంబర్‌లోనే సినిమా విడుదల చేయాలని ఆయన నిర్ణయించారట. డిజిటల్ భాగస్వాములు సైతం డిసెంబర్ రిలీజ్ వైపే మొగ్గు చూపారట. అయితే.. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com